Follow: @mahaadaily
03-01-2026
AN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 10 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

**టాప్ న్యూస్**

### కేసీఆర్ అసెంబ్లీకి రాకుంటే బీఆర్ఎస్ ఖతం



- హరీష్ రావు బచ్చా.. ప్యాకేజీలు తప్ప ఆయనకేం తెలుసు
- సభను వదిలేస్తే బీఆర్ఎస్ కు మరో ప్రమాదం
- తెలంగాణ జాగృతి చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు

02

### కేసీఆర్ వదిలిన బాణం కవిత



- కవిత వ్యాఖ్యలపై మంత్రి వెంకట్ రెడ్డి కౌంటర్
- కేటీఆర్, హరీశ్‌రావులను ఉరితిసినా తప్పు లేదా?
- సీఎంపై వ్యాఖ్యలు సరికాదు

02

### యూట్యూబర్ అన్వేష్‌కు బిగుస్తున్న ఉచ్చు



- హిందూ దేవతలపై వ్యాఖ్యల కేసులో దర్యాప్తు ముమ్మరం
- అన్వేష్‌ను అరెస్ట్ చేయాలని హిందూ సంఘాల డిమాండ్

02




# మునిసిపోల్స్‌కు రెడీ

## మళ్ళీ పట్నం టూర్‌కు సీఎం రేవంత్

### నెలాఖరులో నోటిఫికేషన్.. ఫిబ్రవరిలో ఎన్నికలు

### ఫిబ్రవరి 3 నుండి సీఎం మునిసిపాలిటీల పర్యటనలు

**హైదరాబాద్, మహా:** పంచాయతీ ఎన్నికల్లో దుమ్మురేపిన కాంగ్రెస్ పార్టీ.. పట్నం పోరులోనూ హవా చాటేలా వ్యూహరచన చేస్తోంది. ఈనెలాఖరులో రాష్ట్రంలోని 117 మునిసిపాలిటీలకు, 6 కార్పోరేషన్లకు ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ సర్కార్ డిసైడ్ అయినట్లు కనబడుతోంది. అందుకు తగ్గ కార్యాచరణతో పరుగుపెడుతోంది. మంత్రులు, పార్టీ నేతలు జిల్లాల్లో ఇప్పటికే క్యాడర్‌ను సన్నద్ధం చేస్తున్నారు. వచ్చే నెలలో ఎన్నికలు ఉంటాయని మంత్రులు పదే పదే చెబుతూ వస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో మాదిరిగానే మున్సిపల్ ఎన్నికల కోసం కూడా ప్రచారం చేయడానికి సిద్ధమయ్యారు. మున్సిపల్ ఎన్నికల కోసం వచ్చే నెల 3న జడ్చర్లలో సీఎం రేవంత్ రెడ్డి తొలి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు. జడ్చర్లతో ప్రారంభించి మిగతా జిల్లాల్లోనూ అదే సెంటిమెంట్‌తో ప్రచారం నిర్వహించే అవకాశాలున్నాయి. జడ్చర్ల, నిర్మల్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో సీఎం పర్యటన ఉండే అవకాశాలున్నాయి.

**ఫిబ్రవరి 15లోగా పూర్తిచేసే ప్లాన్**

స్కూళ్లకు పరీక్షల సీజన్ మొదలయ్యేలోపే అంటే ఫిబ్రవరి రెండోవారం నాటికి ఎన్నికలు పూర్తయ్యేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. జనవరి చివరికల్లా అన్నివిధాలుగా ఎన్నికలకు సిద్ధంగా మిగతా 2లో



# మూసీని అభివృద్ధి చేస్తుంటే విషం కక్కుతున్నారు

### మూసీ పునరుజ్జీవంపై చర్చలో సీఎం రేవంత్ రెడ్డి

### గండిపేట నుండి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్

### మార్చి 31 నాటికి అంచనాలు ఖరారు

**హైదరాబాద్, మహా :** మూసీని అభివృద్ధి చేస్తుంటే కొందరు విషం కక్కుతున్నారని, కలుషితమైన మూసీ నీళ్లలో కంటే వారి కడుపులో ఎక్కువ విషం ఉందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై శుక్రవారం రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. మానవ నాగరికత నదీ పరివాహక ప్రాంతాల్లోనే అభివృద్ధి చెందిందని గుర్తు చేస్తూ, కాకతీయుల నుండి నిజాంల వరకు అందరూ నీటి అవసరాల కోసం ప్రాజెక్టులను నిర్మించారని పేర్కొన్నారు.

**వరదల ప్రభావంతో హైదరాబాద్‌లో జంట జలాశయాలు**

1908 వరదల అనంతరం నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు నేటికీ హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్నాయని, అయితే ఆగర్భ శ్రీమంతుల ఫామ్ హౌస్‌ల డ్రైనేజీ వల్ల ఇవి కలుషితం కాకుండా తమ ప్రభుత్వం ఉక్కు పాదం మోపిందని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా లండన్‌లోని థేమ్స్, న్యూయార్క్, సింగపూర్ వంటి నగరాలు తమ నదీ పరివాహక ప్రాంతాలను ఎలా కాపాడుకున్నాయో వివరించిన సీఎం రేవంత్ రెడ్డి, గుజరాత్‌లోని సబర్మతీ, యూపీలోని గంగా నది ప్రక్షాళనను తాము మిగతా 2లో

## అసెంబ్లీకి మేం రాము
# ఈ సెషన్ బాయ్ కాట్

### బీఆర్ఎస్ ఉప నేత హరీష్ రావు ప్రకటన.. స్పీకర్ ఏకపక్ష ధోరణి

**హైదరాబాద్, మహా :** అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రటన చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు, స్పీకర్ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలోనే మూసీ ప్రక్షాళనపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ను టార్గెట్ చేశారు. అయితే సీఎం ప్రసంగంపై మాట్లాడే అవకాశం తమకు కూడా ఇవ్వాలని బీఆర్ఎస్ పట్టుబట్టింది. ఈ క్రమంలో సభలో గందరగోళం నెలకొంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఈ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. మిగతా 2లో




# దుర్గం చెరువు కబ్జా ఆరోపణలు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై కేసు నమోదు
- దుర్గం చెరువులో 5 ఎకరాల స్థలం ఆక్రమించారని ఆరోపణలు
- హైడ్రా ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు
- ఆక్రమిత స్థలాన్ని ప్రైవేట్ ట్రావెల్స్ పార్కింగ్‌కు ఇచ్చినట్లు గుర్తింపు

**హైదరాబాద్, మహా :** దుర్గం చెరువు ఆక్రమణల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. చెరువు స్థలాన్ని ఆక్రమించారన్న ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యేతో పాటు వెంకట్ రెడ్డి అనే వ్యక్తిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. హైడ్రా అధికారుల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గం చెరువు పరిధిలో దాదాపు ఐదు ఎకరాల స్థలాన్ని కబ్జా చేసినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. చెరువు ప్రాంతాన్ని మట్టి, రాళ్లతో నింపి చదును చేశారని, అనంతరం ఆ స్థలాన్ని ఎస్‌టీఎస్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వారికి పార్కింగ్ కోసం అద్దెకు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయి. ఇలా అక్రమంగా ఆక్రమించిన ప్రభుత్వ భూమి ద్వారా నిందితులు అక్రమ ఆదాయం పొందుతున్నారని హైడ్రా తన ఫిర్యాదులో పేర్కొంది. వాస్తవానికి 2014లోనే హెచ్ఎండీఏ దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, నోటిఫికేషన్ ఉన్నప్పటికీ నిబంధనలను ఉల్లంఘించి ఆక్రమణలు జరిగాయని అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణలపై హైడ్రా సూపర్ వైజర్ క్రాంతి ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు స్పందించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డిలపై బీఎన్ఎస్ చట్టంలోని 329(3), 3(5) సెక్షన్లతో పాటు పీడీపీపీ యాక్ట్ సెక్షన్ 3 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# గ్రోక్‌తో మహిళల మార్ఫింగ్ ఫొటోలు

- కేంద్రమంత్రికి ఎంపీ ప్రియాంక చతుర్వేది ఫిర్యాదు
- మహిళల గోప్యతకు సంబంధించిన ఈ అంశంపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

**ఢిల్లీ, మహా :** ఒక సాధారణ మహిళ ఫోటోను అశ్లీలంగా మార్చమని ప్రాంప్ట్ ఇస్తే, దానికి ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా సమాధానం ఇస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాలంలో మహిళల మార్ఫింగ్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ అంశంపై శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల గోప్యతకు సంబంధించిన ఈ అంశంపై తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలంటూ మిగతా 2లో

# మనకున్న శక్తి తక్కువ

### అందులో గ్రూపులు ఎందుకు, గ్రూపులు బువ్వ పెట్టవు

### కొత్త నేతలను ఆదరించి అక్కున చేర్చుకోండి

### రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు

### మల్కాజిగిరి ఎంపీ ఈటల కామెంట్స్

**హైదరాబాద్, మహా :** పార్టీలో చేరిన లీడర్లను గౌరవించండి అక్కున చేర్చుకోండి. కాకులు గద్దల్లా పొడవకండి. స్థానికంగా గ్రూపులు మంచివి కావు. గ్రూపులు బువ్వ పెట్టవు అని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో విశాల హృదయంతో ఉండాలలి గొప్పగా ఆలోచించాలన్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. బీజేపీ నేతలు కూడా అలా ఆలోచన చేయాలి. పరిపక్వత పెరగాలి కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో.. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీ ప్రాంత నాయకులతో శుక్రవారం నిర్వహించిన "మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మనకు ఉన్న శక్తే తక్కువ అని ఇందులో గ్రూప్స్ అవసరమా ? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమం కోసం కాళ్ళ మీద పడి నాయకులను కాపాడుకున్నాం. వేరే పార్టీ వారిని తెచ్చుకున్నాం, ఎన్నికల్లో గెలిపించుకున్నాం. మల్కాజిగిరి పార్లమెంట్ లో 1992 నుండి ఉంటున్న నన్ను నాన్ లోకల్ అని ప్రచారం చేస్తున్న




వారిని పట్టించుకోవద్దు. 25 ఏళ్ల నుండి పార్టీని నమ్ముకునే పని చేసే నిజమైన కార్యకర్తకు పిల్లల ఫీజు కట్టే డబ్బులు కూడా ఉండవు. పార్టీ బలంగా ఉంటే గెలవడానికి పైసలు అక్కర్లేదు. కేవలం డబ్బుతోనే రాజకీయాలు నడవవు అని రాజేందర్ అన్నారు. మోడీ ప్రధాని అయితేనే దేశం సుభిక్షంగా ఉంటుందని దేశవ్యాప్తంగా ఒక వేవ్ వచ్చింది. మిగతా 2లో



కేంద్ర జల సంఘం ఛైర్మన్ నేతృత్వంలో

# నదీజలాల వివాదాల పరిష్కారానికి కమిటీ

- కమిటీ సభ్యులుగా రెండు రాష్ట్రాల జలవనరులశాఖ ఉన్నతాధికారులు
- కమిటీలో సభ్యులుగా కృష్ణా, గోదావరి బోర్డుల ఛైర్మన్లు.

**న్యూఢిల్లీ, మహా :** తెలుగు రాష్ట్రాల మధ్య దశాబ్ద కాలంగా కొనసాగుతున్న నదీజలాల వివాదాలకు ముగింపు పలికే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల జగడాలను పరిష్కరించేందుకు కేంద్ర జల శక్తి శాఖ ఒక ఉన్నత స్థాయి కమిటీని నోటిఫై చేస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర జలసంఘం (సిడబ్ల్యూసీ) ఛైర్మన్ నేతృత్వంలో పనిచేసే ఈ కమిటీలో మిగతా 2లో

# కేసీఆర్ అసెంబ్లీకి రాకుంటే బీఆర్ఎస్ ఖతం

- **హరీష్ రావు బచ్చా.. ప్యాకేజీలు తప్ప ఆయనకేం తెలుసు**
- **సభను వదిలేస్తే బీఆర్ఎస్ కు మరో ప్రమాదం**
- **తెలంగాణ జాగృతి చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా:** అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ వచ్చి సమాధానాలు చెప్పకపోతే బీఆర్ఎస్ పని ఖతం అంటూ తెలంగాణ జాగృతి చీఫ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాల్సిందే అని పట్టుబట్టారు. సభకు రాకుండా పిల్ల కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవు పలికారు. హరీష్‌రావు ఒక బచ్చా అని అన్నారు. ఆయనకు ప్యాకేజీలు తీసుకోవడం తప్ప ఏం తెలుసంటూ హరీష్‌ను టార్గెట్ చేస్తూ కవిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కేసీఆర్ సభకు రాకపోతే హరీష్ రావే అన్నీ చూసుకోవడం సరికాదని.. కేసీఆర్ సభకు వచ్చి సమాధానం చెప్పాలని కవిత వ్యాఖ్యలు చేశారు.

**రేవంత్‌ను పదిసార్లు ఉరితీయాలి**

అలాగే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పక్కన పెట్టిన కేసీఆర్‌ను ఉరి తీయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత స్పందించారు. కేసీఆర్ మీద సీఎం భాష సరికాదన్నారు. కేసీఆర్‌ను ఒకసారి ఉరి తీయాలంటే, రేవంత్ రెడ్డిని పదిసార్లు ఉరి తీయాలంటూ మండిపడ్డారామె. సొంత జిల్లా మహబూబ్ నగర్‌కు రేవంత్ తెచ్చిన ప్రాజెక్టులు ఎన్నని ప్రశ్నించారు.

**బబుల్ షూటర్**

సభలో హరీష్ వర్సెస్ రేవంత్ రెడ్డిల మధ్య వార్ ఉండనుందని కవిత చెప్పుకొచ్చారు. ఇది మరోసారి బీఆర్ఎస్‌కు బలమైన ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. బబుల్ షూటర్ వచ్చి సభలో మాట్లాడితే పార్టీ బద్నామ్ అవుతుందంటూ ఎద్దేవా చేశారు. ఒక్కసారి కేసీఆర్ సభకు వచ్చి వివరణ ఇస్తే బాగుటుందని ఆమె అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్‌కు, తనకు సంబంధం లేదని.. ఇక ముందు ఉండబోదని స్పష్టం చేశారు. కేసీఆర్ ఎందుకు సభకు రావడం లేదో తనకు తెలీదని.. గత నాలుగు నెలలుగా కేసీఆర్‌తో మాట్లాడలేదని చెప్పారు. ఇక్కడ ఫిక్స్‌డ్ మ్యాచ్ నడుస్తోందని ఆరోపించారు. అది సభా వేదికగా బయటపడిందన్నారు. నీటి వాటాల అంశంలో కేసీఆర్ ఒక్కరే సమాధానం చెప్పగలరని.. హరీష్ రావుకు అవకాశం ఇవ్వడం అనేది సరైంది కాదని కవిత పేర్కొన్నారు.



# తెలుగునాట దూసుకుపోతున్న ఎఎన్ఎన్

**తక్కువ కాలంలో అత్యధిక వీక్షకాదరణ.. క్యాలెండర్ ఆవిష్కరించిన ఎఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి**

**హైదరాబాద్, మహా:** తెలుగునాట ఎఎన్ఎన్ ఛానల్ తక్కువ కాలంలో అత్యధిక వీక్షకాదరణతో దూసుకుపోతున్నదని, నిజమే బలంగా ఎఎన్ఎన్ ముందుకు వెళ్తున్నదని ఎఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఎఎన్ఎన్ మహా పత్రిక కార్యాలయంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. తెలుగురాష్ట్రాల్లో 600మందికి పైగా క్షేత్రస్థాయి నెట్‌వర్క్ ఉన్న అమ్మన్యూస్ నెట్ వర్క్ నాణ్యమైన వార్తాకథనాలతో ప్రజాదరణ పొందిందన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో అసోసియేట్ ఎడిటర్ గడ్డం క్రిష్ణమూర్తి, న్యూస్ కోఆర్డినేటర్ రాంప్రసాద్, డెస్క్ ఇన్ ఛార్జి అజయ్, ఎడిటర్స్ వింగ్ హెచ్ఓడి సురేందర్, గ్రాఫిక్స్ ఇన్ ఛార్జిలు భాగ్యరాజ్, మధు, మహాపత్రిక చీఫ్ డిజైనర్ షరీఫ్ , డిజిటల్ హెడ్ ఆదిగురు, కెమెరా డిపార్ట్ మెంట్ హెచ్ ఓడి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# విషం కక్కుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నడూ తప్పుపట్టలేదని గుర్తుచేశారు.

**మూసీ కాలుష్యంతో ప్రజలకు అనారోగ్యం..**

మూసీ కాలుష్యం కారణంగా నల్లగొండ జిల్లా ప్రజలు పడుతున్న బాధలను ప్రస్తావిస్తూ, పారిశ్రామిక వ్యర్థాల వల్ల నది ఒడ్డున మహిళలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పరివాహకంలో నివసించే మహిళలు తల్లులు కాలేకపోవడానికి కారణాలు మూసి కాలుష్యమేనని వైద్యులు చెబుతున్నారని పేర్కొన్నారు. దీనికి శాశ్వత పరిష్కారంగా గోదావరి జలాలను మూసీకి తరలించేలా 20 టీఎంసీల సామర్థ్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో 15 టీఎంసీలు తాగునీటి అవసరాలకు, 5 టీఎంసీలు నదిలో నిరంతరం స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా ఉపయోగిస్తామని తెలిపారు. మూసా, ఈసా నదుల సంగమ ప్రాంతమైన బాపూఘాట్ వద్ద 'గాంధీ సరోవర్' పేరుతో అద్భుతమైన పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఇక్కడ డిఫెన్స్ భూముల బదలాయింపునకు కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారని, మార్చి 31 లోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

**ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్ సిటీ**

పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న తరుణంలో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా గండిపేట నుండి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామని, పాతబస్తీని ఒరిజినల్ సిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మూసీ పరీవాహక ప్రాంత పేదలకు మెరుగైన వసతులు కల్పిస్తామని, అక్కడ శివాలయం, గురుద్వార్, మసీదు, చర్చిలను నిర్మించి మత సామరస్యాన్ని చాటుతామని చెప్పారు. విపక్షాలు తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అని విమర్శించడంపై స్పందిస్తూ, రియల్ ఎస్టేట్ కూడా ఒక పరిశ్రమ అని, హైటెక్ సిటీ నిర్మించేటప్పుడు కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయని గుర్తు చేశారు. మూసీ అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని, కడుపులో విషం పక్కనపెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# మునిసిపోల్స్‌కు రెడీ

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు సూచించినట్లు తెలుస్తోంది. ఆదిశగా ఏర్పాట్లు చకచక సాగుతున్నాయి. రాష్ట్రంలోని 117 మునిసిపాలిటీలు, ఆరు కార్పోరేషన్లలో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఓటర్ జాబితా సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. డిసెంబర్ 30వ తేదీ నుంచి 2026 జనవరి 10వ తేదీ వరకు ఓటరు జాబితా తయారీకి ఎస్ఈసీ కసరత్తు చేయనుంది. 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల (నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, కరీంనగర్, కొత్తగూడెం, రామగుండం)లో ఓటర్ జాబితా తయారీ ప్రక్రియ మొదలైంది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి పట్టణ స్థానిక సంస్థలకు దాదాపు రూ.700కోట్ల నిధులు రావాల్సి ఉంది. వీటిని సాధించుకోవాలంటే వచ్చే మార్చిలోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి చివర్లో పాలకవర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలనలో మున్సిపాలిటీలు కొనసాగుతున్నాయి. వచ్చే ఫిబ్రవరితో జీహెచ్ఎంసీ పాలకవర్గం, వచ్చే మే నెలతో వరంగల్, ఖమ్మం, సిద్దిపేట, అచ్చంపేట, జడ్చర్ల, కొత్తూరు, నకిరేకల్ లాంటి పాలకవర్గాల గడువు ముగియనుంది. జీహెచ్ఎంసితో కలిపి వీటికి సమ్మర్ లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి.

## అసెంబ్లీకి మేం రాము
# ఈ సెషన్ బాయ్ కాట్

**బీఆర్ఎస్ ఉప నేత హరీష్ రావు ప్రకటన.. స్పీకర్ ఏకపక్ష ధోరణి**

(మొదటిపేజీ తరువాయి)

స్పీకర్ ఏకపక్ష వైఖరి, ప్రభుత్వ అప్రజాస్వామిక ధోరణికి నిరసనగా ఈ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రకటించారు. గన్ పార్క్ వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన మూసీ కంపు కంటే సీఎం మాటల కంపు ఎక్కువైందని విమర్శించారు. మూసీ ప్రక్షాళన కాదు.. ముందు సీఎం నోరు ప్రక్షాళన చేయాలని దుయ్యబట్టారు. “శాసనసభ నడుస్తున్న తీరు ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధంగా ఉంది. బీఏసీ సమావేశానికి మమ్మల్ని గంటన్నర సేపు వెయిట్ చేయించి అవమానించారు. ఈ సమావేశంలో సభను 7 రోజుల పాటు నడపాలని, ఆ తర్వాత మళ్ళీ సమావేశమై తదుపరి షెడ్యూల్ నిర్ణయిద్దామని స్పష్టంగా అనుకున్నాం కానీ, సభలో ప్రవేశపెట్టిన మినిట్స్‌లో మాత్రం సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్ నిర్ణయానికే వదిలేస్తున్నాం అని తప్పుడు సమాచారం పొందుపరిచారు స్పీకర్ గారు సభను కస్టోడియన్‌లా కాకుండా, ఏకపక్షంగా నడుపుతున్నారు. సభలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షంగా మా బాధ్యత. క్వశ్చన్ అవర్‌లో 10 ప్రశ్నలు ఉంటే, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని మా మైక్ కట్ చేశారు” అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

“పార్లమెంట్‌లో ప్రధాని మోదీని రాహుల్ గాంధీ విమర్శించ లేదా? మరి ఇక్కడ మేము సీఎంను ప్రశ్నిస్తే మైక్ ఎందుకు ఆపేస్తున్నారు? ముఖ్యమంత్రిని విమర్శించవద్దని స్పీకర్ మాకు రూల్స్ చెప్పడం ఎక్కడి పద్ధతి. ప్రతిపక్షం మాట్లాడకూడదంటే అసలు సభ ఎందుకు? మమ్మల్ని ఎందుకు పిలిచినట్లు? మూసీ ప్రక్షాళన కంటే ముందు సీఎం నోరు ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందిసభలో సీఎం బాడీ షేమింగ్ చేస్తూ మాట్లాడుతున్నారు. ఒక ముఖ్యమంత్రిలా కాకుండా వీధి రౌడీలా ప్రవర్తిస్తున్నారు. అసెంబ్లీని సీఎల్పీ మీటింగ్‌లా, గాంధీ భవన్‌లా మార్చేశారు సభలో అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా బయట మాట్లాడినట్లే సొల్లు వాగుడు వాగుతున్నారు” అని హరీశ్ రావు ఆక్షేపించారు. “కేసీఆర్ పై సీఎం వాడిన భాషను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. రేవంత్ రెడ్డి నువ్వే అసలైన తెలంగాణ ద్రోహివి, తెలంగాణ నీటి ద్రోహివి. మూసీపై చర్చకు మేము సిద్ధం. షార్ట్ డిస్కషన్ పెట్టండి, రోజంతా చర్చిద్దాం. కానీ క్వశ్చన్ అవర్‌లో సీఎం వచ్చి గంటన్నర సేపు అడ్డగోలుగా మాట్లాడితే ఎలా? మూసీ ప్రక్షాళనకు గోదావరి జలాలను మల్లన్నసాగర్ నుంచి తెస్తున్నారా అని అడిగాము దానికి సమాధానం చెప్పలేదు. మూసీలో ఇళ్లు కోల్పోయిన పేదలకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరాము. వీటికి సమాధానం చెప్పకుండా ఎదురుదాడి చేస్తున్నారు” అని హరీశ్ రావు చెప్పారు.

“రాహుల్ గాంధీ దేశంలో రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తిరుగుతుంటే.. ఇక్కడ రేవంత్ రెడ్డి అసెంబ్లీలో రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారు అవినీతికి ఆఫిషియల్ గా రేట్లు పెట్టి మరీ పెంచిన రేవంత్ రెడ్డికి మా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు.సభలో అందరికీ సమాన హక్కులు కల్పించాల్సిన స్పీకర్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు.స్పీకర్ తీరుకు, ప్రభుత్వ అహంకారపూరిత వైఖరికి నిరసనగా ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తిగా బహిష్కరిస్తున్నాం” అని హరీశ్ రావు ప్రకటించారు.

## బళ్లారిలో
# పొలిటికల్ ఫైట్

**గాలి జనార్ధన్ రెడ్డిపై హత్యాయత్నం**
**11మందిపై ఎఫ్ ఐ ఆర్**

**మహా:** కర్ణాటకలోని బళ్లారిలో గురువారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. మహర్షి వాల్మీకి విగ్రహ ఏర్పాటు కార్యక్రమ బ్యానర్ల ఏర్పాటు విషయంపై గంగావతి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే జనార్ధన రెడ్డి, బళ్లారి నగర కాంగ్రెస్ ఎమ్మెల్యే భరత్ రెడ్డి అనుచరుల మధ్య ఘర్షణ జరిగింది. బళ్లారిలోని అవంభవి ఏరియాలో ఉన్న ఎమ్మెల్యే జనార్ధన రెడ్డి నివాసం ఎదుట ఎమ్మెల్యే భరత్ రెడ్డి అనుచరులు ఓ బ్యానర్‌ను ఏర్పాటు చేసేందుకు యత్నించారు. దీనిపై ఇరువురు ఎమ్మెల్యేల అనుచరుల మధ్య తొలుత తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో అక్కడికి బీజేపీ నేత, మాజీ మంత్రి శ్రీరాములు చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేల అనుచరులు భౌతికదాడులు చేసుకున్నారు. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. పోలీసులు అక్కడికి హుటాహుటిన చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఘర్షణ పడుతున్న వారిపై లాఠీ చార్జ్ చేశారు. గాల్లోకి కాల్పులు జరిపారు. ఓ వ్యక్తి జనార్ధన్ రెడ్డిపైకి కాల్పులు జరపబోగా, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్ చనిపోయాడని పోలీసులు గుర్తించారు. గురువారం రాత్రి బళ్లారిలో 144 సెక్షన్‌ను అమలు చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం రోజు బళ్లారి, గంగావతి పట్టణాల్లో బందోబస్తును కట్టుదిట్టం చేశారు. అదనపు పోలీసు బలగాలను మోహరించారు. నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నారు. బళ్లారి ఐజీపీ, ఎమ్మెల్యేలతో కర్ణాటక హోంమంత్రి, డీజీపీ ఫోన్‌లో మాట్లాడి ఈ ఘటన వివరాలు తెలుసుకున్నారు.

# కేసీఆర్ వదిలిన బాణం కవిత

**కవిత వ్యాఖ్యలపై మంత్రి వెంకట్ రెడ్డి కౌంటర్**
**కేటీఆర్, హరీశ్‌రావులను ఉరితిసినా తప్పు లేదా?**
**సీఎంపై వ్యాఖ్యలు సరికాదు**

**హైదరాబాద్, మహా :** కేసీఆర్ వదిలిన బాణం కవిత అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డిపై కవిత వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో మంత్రి వెంకట్ రెడ్డి చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కవిత కన్ఫ్యూజన్ లో ఉండి జనాల్ని కన్ఫ్యూజ్ చేస్తోందన్నారు. కేసీఆర్ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే ఊరూరా తిరుగుతోందని, కవిత టీఆర్ఎస్‌లో ఉందా? బయట ఉందా ఏ పార్టీలో ఉంది స్పష్టం చేయాలని ప్రశ్నించారు. తన తండ్రి మీద సీఎం చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కవిత హరీశ్ రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదు? అని నిలదీశారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న నాయకులు అందర్నీ దూరం చేసేందుకు కవిత విమర్శలు చేస్తున్నట్లు కనిపిస్తుందని ఆరోపించారు. కేసీఆర్‌ను ఉరి తీసినా తప్పు లేదన్న దానికి రక్తం మరిగిపోయిందన్న కవిత.. కేటీఆర్, హరీశ్ రావులను ఉరితిసినా తప్పు లేదా కవిత చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నేతలందరినీ కోట్ల రూపాయలు దోచుకున్నావ్ అని కవిత విమర్శిస్తోందని అన్నారు. కేసీఆర్ సభకు రోజు వస్తే బీఆర్ఎస్ పుంజుకుంటుంది అని కవిత అంటోందని, కవిత బీఆర్ఎస్ లోనే ఉన్నట్టు అనుమానం ఉందని చెప్పారు. కేసీఆర్‌ను తిడితే వస్తున్న కోపం హరీశ్ రావు ను తిడితే కవిత కు ఎందుకు రావడం లేదన్నారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ తప్పు అని కవిత ఒప్పుకోవడం సంతోషం అని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నల్లగొండ మంత్రి జిల్లాకు చేసిన అన్యాయంపై కవిత ప్రశ్నించాలని డిమాండ్ చేశారు.

**నాకు మా తమ్ముడితో ఎటువంటి గొడవలు లేవు**

నాకు సీఎం అంటే గౌరవం అని, సీఎం రేవంత్ రెడ్డిని ఎవరు ఏమన్నా అంటే కౌంటర్ ఇస్తా అని మంత్రి చెప్పుకొచ్చారు. నాకు మంత్రి పదవి కావాలని ఎవరిని అడగలేదని, నాకు మా తమ్ముని మధ్య ఎటువంటి గొడవలు లేవని స్పష్టం చేశారు. నేను మంత్రి పదవి కోసం ఏరోజు పాకులాడలేదని, తెలంగాణ కోసం మంత్రి పదవి త్యాగం చేసానని అన్నారు.

# గ్రోక్‌తో మహిళల మార్ఫింగ్ ఫొటోలు

- **కేంద్రమంత్రికి ఎంపీ ప్రియాంక చతుర్వేది ఫిర్యాదు**
- **మహిళల గోప్యతకు సంబంధించిన ఈ అంశంపై కేంద్రం జోక్యం చేసుకోవాలి**

(మొదటిపేజీ తరువాయి)

ఆమె కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' అసభ్య పదజాలంతో, దూషణలతో విరుచుకుపడుతున్నట్లు ఆరంభంలో విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత రాజకీయంగా పక్షపాతం చూపిస్తోందన్న ఆరోపణలు కూడా వచ్చాయి. తాజాగా మహిళల అశ్లీల ఫొటోలను మార్ఫింగ్ చేయడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో, ముఖ్యంగా 'ఎక్స్'లో నడుస్తున్న అసభ్యకర ట్రెండ్ గురించి మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నానని, ఏఐ గ్రోక్‌ను ఉపయోగించి కొందరు మహిళల చిత్రాలను మార్ఫింగ్ చేస్తున్నారని ఎంపీ ప్రియాంక చతుర్వేది ఆ లేఖలో పేర్కొన్నారు. ఏఐని దుర్వినియోగం చేస్తున్నారని, గ్రోక్ కూడా ఇలాంటి ప్రాంప్ట్‌లను అందిస్తోందని ఆమె కేంద్ర మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇది మహిళల హక్కులకు, భద్రతకు భంగం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అనైతికమే కాదని, నేరం కూడా అని, కాబట్టి ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# మనకున్న శక్తి తక్కువ

(మొదటిపేజీ తరువాయి)

ఈటల రాజేందర్ వల్ల కొంచెం ఎక్కువ ఓట్లు రావచ్చు కానీ గెలిచింది మాత్రం మోదీ వల్లనే. ఆ వేవ్ ను మనకు అనుకూలంగా మార్చుకోవడం వల్లనే నాలుగు లక్షల మెజారిటీ వచ్చింది. గౌరవం పరస్పరంగా ఉండాలి. నువ్వు లీడర్లను గౌరవిస్తేనే..నిన్ను కార్యకర్తలు గౌరవిస్తారు. బీజేపీ అజేయమైన శక్తిగా ఎదగాలి. నన్ను మీరు గెలిపించారు. మీ గెలుపులో ఉడత భక్తిగా సాయం చేస్తా.నా చేతులు దండం పెట్టడానికి అలవాటు పడ్డాయి. నాకు ప్రజలే దేవుళ్ళు. మీకోసం ఎన్నిసార్లయినా దండం పెడతా అని ఆయన అన్నారు. మన కొట్లాట వల్ల జీహెచ్ఎంసీలో మన కార్పొరేటర్స్ కి 300 కోట్ల నిధులు వచ్చాయి. బీజేపీ లెటర్ ప్యాడ్ మీద లెటర్ పెడితే కోట్ల నిధులు వచ్చాయి. మోడీ ఎప్పుడూ నేను ఇచ్చిన అనరు, నేను సేవకుడిని మాత్రమే.. ప్రజలే యజమానులు అని అంటారు. ఇక్కడున్న సంకుచిత వాదులు మాత్రం నేను ఇచ్చిన అంటారు. గెలుపే లక్ష్యంగా పని చేయడం నుండి నేను మీకు అండగా ఉంటాను అన్నారు. సుపరిపాలన, ప్రజలు మెచ్చే పాలన అందించడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యం అన్న ఆయన మన పరివార క్షేత్రాలు అనేక సమస్యల మీద కొట్లాడుతాయి. కానీ వాటిని పరిష్కరించే సత్తా అధికారంలోకి వస్తేనే ఉంటుందని ఈటల స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి, నందా రెడ్డి చంద్రారెడ్డి, శోభమ్మ రామోజీ సురేష్, మోహన్ రెడ్డి, సుధాకర్, లక్ష్మమ్మ, శైలజ, వెంకటరెడ్డి, శ్రీనివాస్, పావని తదితరులు పాల్గొన్నారు



## కేంద్ర జల సంఘం ఛైర్మన్ నేతృత్వంలో
# నదీజలాల వివాదాల పరిష్కారానికి కమిటీ



(మొదటిపేజీ తరువాయి)

ఇరు రాష్ట్రాల జల వనరుల శాఖకు చెందిన అత్యున్నత స్థాయి అధికారులు సభ్యులుగా ఉండనున్నారు. గత 11 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సహకార సమాఖ్య స్ఫూర్తితో పరిష్కరించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యం. ఈ కమిటీ కూర్పును పరిశీలిస్తే, ఇందులో రెండు రాష్ట్రాల నుంచి కీలక ప్రతినిధులకు చోటు కల్పించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి జలవనరుల శాఖ సలహాదారు, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ మరియు ఇంజనీర్‌ఇన్‌చీఫ్ సభ్యులుగా వ్యవహరిస్తారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ తరపున జలవనరుల శాఖ స్పెషల్ సెక్రటరీ, శాఖ సలహాదారు, ఇంజనీర్‌ఇన్‌చీఫ్ (ఇరిగేషన్) మరియు చీఫ్ ఇంజనీర్లు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరితో పాటు కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్లు, నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్ డబ్ల్యుడీఏ) మరియు సిడబ్ల్యుసీ చీఫ్ ఇంజనీర్లు కూడా ఈ కమిటీలో భాగస్వాములై సాంకేతిక అంశాలను పర్యవేక్షిస్తారు.

ఈ కమిటీ ఏర్పాటుకు బీజం జూలై 2025లో ఢిల్లీలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పడింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన ఆ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని తమ అభ్యంతరాలను, వివాదాలను ప్రస్తావించారు. ఆ చర్చల ఫలితంగానే, సమస్యలను సాంకేతికంగా పరిశీలించి పరిష్కార మార్గాలను సూచించేందుకు ఉమ్మడి కమిటీ అవసరమని భావించారు. ఇందుకోసం ఇరు రాష్ట్రాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయాలని కోరగా, డిసెంబర్ 2025లో తెలంగాణ ప్రభుత్వం తన నామినేషన్లను పూర్తి చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం తాజాగా ఈ కమిటీని అధికారికంగా నోటిఫై చేసింది. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్2 (కేడబ్ల్యుడీటీ2) గడువును కూడా కేంద్రం 2026 జూలై వరకు పొడిగించి, వివాదాల పరిష్కారానికి నిరంతర సహకారాన్ని అందిస్తోంది. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 84 ప్రకారం ఏర్పడిన అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాల మేరకు, ఇప్పుడు ఏర్పాటైన ఈ నూతన కమిటీ క్షేత్రస్థాయిలో ఉన్న జలవివాదాలను లోతుగా అధ్యయనం చేయనుంది. ఈ కమిటీ రాకతో గోదావరి, కృష్ణా నదీ జలాల వినియోగంపై నెలకొన్న సందిగ్ధత తొలగిపోయి, రెండు రాష్ట్రాల రైతులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

# హిడ్మాను పట్టించిన వారిని చంపేస్తాం

**మేము ప్రాణ బిక్షపెడితే మా ప్రాణాలే తీయిస్తావా**

చర్లలో ప్రముఖ నాయకుడిని హతమారుస్తామంటూ లేఖ
కార్పొరేట్ కంపెనీలకు ఆదివాసీల భూములు మోడీ అప్పగింత
భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే ఏఎస్ఆర్)
విప్లవ పేరు మీదుగా మావోయిస్టు లేఖ విడుదల




**చర్ల, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి సంబంధించిన ఓ ప్రముఖ అధికార పార్టీ రాజకీయ నాయకుడు ఇద్దరు మావోయిస్టు అగ్రనాయకులను చంపించడంలో కీలకపాత్ర పోషించారని ఆరోపిస్తూ మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. మావోయిస్టు పార్టీ నాయకులపై జరుగుతున్న హత్యాకాండను ఎన్‌కౌంటర్ గా చిత్రీకరిస్తున్నారని ఆడవులలో ఖనిజ సంపదను ఎత్తుకెళ్ళేందుకు ఆదివాసులపై మరియు ప్రజల కోసం పోరాటం చేస్తున్నవారిని హత్యచేస్తున్నారని లేఖలో ఆరోపించారు. ఈ మధ్య కాలంలో మా పార్టీ హతమార్చిన కాంట్రాక్టర్ మావోయిస్టు పార్టీని మోసం చేసి మా పార్టీకి ద్రోహం చేశాడని. మాకు చేసిన ద్రోహాన్ని స్వయంగా ఒప్పుకున్నాడని. అందుకే మా కోర్టులో శిక్ష వేశామని లేఖలో వివరించారు. తమ దృష్టిలో ఇంకా కొంతమంది కాంట్రాక్టర్లు ఉన్నారని. వారికి కూడా త్వరలో శిక్ష తప్పదని. అడవిలోకి వెళ్ళాము, తప్పించుకున్నాము అనే భ్రమలో బ్రతుకుతున్నారని మా పార్టీ కామ్రేడ్స్ మీతోనే, మీ మధ్యలోనే ఉన్నారని ,మీకు శిక్ష మీరు ఉన్నదగ్గరే వేస్తామని పేర్కొన్నారు. మా కామ్రేడ్స్ హిడ్మాను, రాజి ఇంకొందరు సభ్యులను మోసం చేసి మాయ మాటలు చెప్పి హాస్పటల్ అని తీసుకొని వెళ్ళిన కాంట్రాక్టర్ ఎవరో తమకు తెలిసిపోయిందని, ఆ కాంట్రాక్టర్ యొక్క "వాయిస్ రికార్డింగ్" మాటలు మా దగ్గర ఉన్నాయని, కాంట్రాక్టర్ సహాయం చేసిన వారు కూడా ఎవరో తమ విచారణలో తెలిసిపోయిందన్నారు. మా కామ్రేడ్స్ ను తీసుకొని వెళ్ళేందుకు కారు ఏర్పాటు చేసిన వ్యక్తి ఒక రాజకీయ బ్రోకర్ చర్ల మండలంలోనే ఉన్నాడని. అతను అధికారపార్టీకి చెందిన నల్లపు దుర్గాప్రసాదుగా అని తమ విచారణలో తెలిసిపోయిందని లేఖలో పేర్కొన్నారు. డోకుపాడు మీదుగా కొండవాయి మార్గం మధ్యలో వాహనం ఉంచి కాంట్రాక్టర్ కి సహాయకుడిగా ఈ ద్రోహి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్ కి తీసుకొని వెళ్ళి శత్రువులకి అప్పగించినాడని, మా కామ్రేడ్స్ మరణానికి కారణమైన వారిని ఎవరిని వదిలిపెట్టం. ఖబడ్దార్ నల్లపు దుర్గాప్రసాద్ నీకు మా కామ్రేడ్స్ పాణభిక్షపెడితే నువ్వు మా కామ్రేడ్స్ నే చంపిస్తావా నీకు మా ప్రజల చేతిలో మరణశిక్ష తప్పదు అని లేఖ లో వివరించారు. పోలీసు బలగాలను మా అడవుల మీదకు పంపించడం కాదు, మీరు పరిపాలించే ప్రజలకు ప్రాణనష్టం కలిగించకుండా చూసుకోండి. భద్రాచలం వంటి ప్రజల సమూహం తిరుగుతున్న ప్రదేశంలో జరిగిన హత్య మీ ఇలాకాలో జరిగింది కదా ఇదీ మీ పరిపాలన అని దుయ్యబట్టారు ప్రజల కోసం పనిచేసే మావోయిస్టు పార్టీకి ప్రజాస్వామిక వాదులు మేధావులు, విద్యావంతులు, జర్నలిస్టు పౌర హక్కులు, మానవహక్కుల సంఘాలు విప్లవోద్యమాలు, ఉద్యమాలకు మద్దతు ఇవ్వవలసినదిగా కోరుతున్నాం. అంటూ మావోయిస్టు పార్టీ విప్లవ పేరు మీదుగా మావోయిస్టులు శుక్రవారం లేఖ విడుదల చేశారు

# పోలీస్ బాస్ ఫిట్ నెస్ శపథం

### ఆసక్తికరంగా మారిన హైదరాబాద్ సీపీ సజ్జనర్ 2026 'రెజల్యూషన్స్



**హైదరాబాద్, మహా :** నిత్యం నేరస్తుల భరతం పట్టే పనిలో, నగర భద్రతా పర్యవేక్షణలో తలమునకలై ఉండే నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్.. జిమ్‌కు వెళ్లే విషయంలో మాత్రం సామాన్యుడిలాగే ఇన్నాళ్లూ వాయిదాల పర్వాన్ని నడిపారు. అయితే ఈ కొత్త ఏడాదిలో ఆ ధోరణికి చెక్ పెట్టాలని ఆయన నిర్ణయించుకున్నారు. శారీరక దృఢత్వం కోసం ఎప్పటినుంచో జిమ్‌లో చేరాలని అనుకుంటున్నప్పటికీ.. విధి నిర్వహణ హడావుడిలో వాయిదా పడుతూ వస్తున్న ఆ ప్రణాళికను ఈసారైనా కచ్చితంగా ఆచరణలో పెట్టడమే తన ప్రధాన వ్యక్తిగత లక్ష్యమని 'ఎక్స్' ద్వారా సీపీ సజ్జనర్ వెల్లడించారు. నూతన సంవత్సర వేడుకల బందోబస్తు హడావుడి ముగిశాక.. తన వ్యక్తిగత, వృత్తిపరమైన లక్ష్యాలను ఆయన నగరవాసులతో పంచుకున్నారు. నిరంతరం ప్రజల భద్రత గురించి ఆలోచించే ఓ ఉన్నతాధికారి.. తన ఫిట్‌నెస్ గురించి తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఆసక్తికర చర్చకు దారితీసింది. కేవలం వ్యక్తిగత ఆరోగ్యమే కాదు, నగర ఆరోగ్యాన్ని కాపాడటం కూడా తన బాధ్యతేనని సజ్జనర్ స్పష్టం చేశారు. ఈ ఏడాది ప్రధానంగా 'సైబర్ నేరాలపై యుద్ధం' ప్రకటిస్తున్నట్లు సంకేతాలిచ్చారు. ఆన్‌లైన్ మోసాలు, సరికొత్త తరహా నేరాలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా, అత్యంత సురక్షిత నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రథమ అజెండా అని తేల్చిచెప్పారు. సమర్థవంతమైన పోలీసింగ్‌కు వెన్నముక లాంటి క్షేత్రస్థాయి సిబ్బంది ఆరోగ్యం విషయంలో రాజీపడేది లేదని సీపీ భరోసా ఇచ్చారు. వారు శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలందుతాయని, అందుకే సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని వెల్లడించారు. వృత్తిలో రాణించడానికి 'నిరంతర అభ్యాసం' మంత్రంలాంటిదని నమ్మే సజ్జనర్.. ఈ ఏడాది పుస్తక పఠనానికి, కొత్త విషయాలు నేర్చుకోవడానికి ప్రత్యేక సమయం కేటాయిస్తానని తెలిపారు. అన్నింటికీ మించి, నిత్యం విధి నిర్వహణలో తన వెన్నంటి ఉంటూ ప్రోత్సహించే కుటుంబ సభ్యులు, మిత్రులతో నాణ్యమైన సమయాన్ని గడపడానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

# మావోయిస్టు పార్టీకి మరో బిగ్ షాక్

### డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట మావోయిస్టు కీలక నేత బర్సె దేవా.. మావోయిస్టు ప్రాంతంగా మారిన బస్తర్





**హైదరాబాద్, మహా :** వరుస దెబ్బలతో రోజురోజుకూ కూనరిల్లుతోన్న మావోయిస్టు పార్టీకి మరో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఇటీవల కాలంలో అనేక మంది మావోయిస్టు నేతల పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. పలువురు కీలక నేతలు ఎన్‌కౌంటర్‌లో మరణించడం, పార్టీ బలహీనపడటం, ఆరోగ్య సమస్యలు ఇతరత్రా కారణాలతో గత సంవత్సరం వందల్లో మావోయిస్టులు పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. ఇది మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బే అని చెప్పుకోవచ్చు. తాజాగా మరోసారి మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది. మరో కీలక నేత పోలీసుల ముందు లొంగిపోయారు. శుక్రవారం మావోయిస్టు ముఖ్య నేత బర్సె దేవా.. డీజీపీ శివధర్ రెడ్డి ముందు లొంగిపోయారు. దేవా మావోయిస్టు పార్టీ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా పనిచేస్తున్నారు. మావో అధినేత హిడ్మా ఎన్ కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీ సాయిధ బలగాల వ్యవహారాలను బర్సె దేవా చూస్తున్నారు. హిడ్మా, బర్సె దేవా ఒకే గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. మావోయిస్టు పార్టీకి ఆయుధాల సరఫరాలో దేవా అత్యంత కీలక పాత్ర పోషించారు. డీజీపీ ముందు దేవా లొంగిపోగా అతడి నుంచి మౌంటెన్ ఎల్ఎంజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేవాతో పాటు మిల్ట్రీ ఆపరేషన్ సభ్యులు కూడా సరెండర్ అయ్యారు. బర్సె దేవాతో పాటు లొంగిపోయిన వారందరినీ శనివారం మీడియా ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉంది. దేవా లొంగిపోవడం, తదితర వివరాలను డీజీపీ మీడియా సమావేశంలో వెల్లడించనున్నారు. వాస్తవానికి గత రెండు మూడు రోజులుగా మావోయిస్టు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్జీఏ) ఫస్ట్ బెటాలియన్ కమాండర్ బార్సె దేవా, మరికొందరు సభ్యులు తెలంగాణ పోలీసుల అదుపులో ఉన్నారనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అగ్రనేత, కేంద్రకమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి ఎక్కడ ఉన్నాడనే చర్చ మరోమారు జరగింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, కాకినాడ, ఏలూరు పట్టణాల్లో జరిగిన మావోయిస్టుల అరెస్టుల సందర్భంలో దేవ్‌జీ కూడా వారిలో ఉన్నాడనే చర్చ జరిగింది. ఆయన ప్రాణాలకు హాని ఉందని, హిడ్మాలాగే ఆయననూ ఎన్‌కౌంటర్ చేయనున్నారని పౌరహక్కుల సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు ఏపీ హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలైంది. కోరుట్లకు చెందిన దేవ్‌జీ కుటుంబం సైతం ఆయన జాడ చెప్పాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో సడన్‌గా ఆయన డీజీపీ ఎదుట లొంగిపోవడం గమనార్హం.

**మావోయిస్టు రహిత ప్రాంతంగా బస్తర్?**

బర్సె దేవాతో పాటు పలువురు మావోయిస్టులు లొంగిపోవడంతో గత కొన్నేళ్ళుగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉన్న ఛత్తీస్ ఘడ్ లోని బస్తర్ ప్రాంతం మావోయిస్టు రహితంగా మారనుంది. డీజీపీ ఎదుట బర్సె దేవా లొంగిపోవడం, ఆయనతో పాటు మరికొంత మంది మావోయిస్టులు సరెండర్ కావడంపై పరిశీలిస్తే లొంగిపోయిన వారంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టు కేడర్లేనని సమాచారం. వీరి లొంగుబాటుతో దాదాపుగా బస్తర్ ప్రాంతం మావోయిస్టు రహితంగా మారినట్లేనని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఇంటెలిజెన్స్ వర్గాల అంచనా ప్రకారం బస్తర్ ప్రాంతంలో ప్రభుత్వ బలగాల ఆధిపత్యం, ఆపరేషన్ కగార్ దాడి తీవ్రత రీత్యా మావోయిస్టులు తిరగలేని పరిస్థితి ఉంది. వారికి ఆహారం, ఇతర సామగ్రి దొరకడం కూడా కష్టంగా మారింది. ఫలితంగా కేడర్లందరినీ ఆ ప్రాంతం విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లమని నాయకత్వం ఆదేశాలిచ్చినట్లుగా సమాచారం. అలా వచ్చిన కొంత మంది ఆ మధ్య ఆదిలాబాద్‌లో ఆయుధాలతో సహా పోలీసులకు లొంగిపోయిన విషయం తెలిసిందే. ఇప్పుడు దేవా తదితరులు కూడా అదే బాటలో నడిచారంటున్నారు. దేవ్‌జీ, ఆయన రక్షణ సిబ్బంది, ఇంకా మిగిలిన పాపారావు లాంటి నేతలు కూడా తెలంగాణకే వచ్చారా? అన్న విశ్లేషణ నిఘా వర్గాల్లో జరుగుతోంది.

# నేడు కొండగట్టుకు పవన్ కల్యాణ్

### టీటీడీ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### డిప్యూటీ సీఎం హోదాలో పవన్ తెలంగాణ పర్యటన



**హైదరాబాద్, మహా :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న సన్నిధిలో శనివారం ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం ఉదయం కొండగట్టు క్షేత్రాన్ని దర్శించుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం మంజూరు చేసిన రూ.35.19 కోట్ల భారీ నిధులతో నిర్మించనున్న భక్తుల వసతి సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ఉదయం 10:30 గంటల నుండి 11:30 గంటల మధ్య ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. కొండగట్టు అంజన్నను తన ఇలవేల్పుగా పవన్ కళ్యాణ్ భావిస్తారు. ఎన్నికల విజయం అనంతరం స్వామివారిని దర్శించుకున్న సమయంలో భక్తుల అవసరాలను గుర్తించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు వసతి సౌకర్యాలు లేక, దీక్షా విరమణ సమయంలో పడుతున్న ఇబ్బందులను ఆలయ అధికారులు, అర్చకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన పవన్ కళ్యాణ్, కొండగట్టు అభివృద్ధికి టిటిడి సహకారం అందించాలని ప్రతిపాదించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించడంతో టిటిడి నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తో పవన్ కళ్యాణ్ జరిపిన చర్చల ఫలితంగా, బోర్డు రూ.35.19 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 96 గదుల భారీ సత్రం, అలాగే ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా విశాలమైన మండపాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్‌తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, టిటిడి బోర్డు సభ్యులు పాల్గొననున్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఆధ్యాత్మిక, సాంస్కృతిక బంధాన్ని ఈ ప్రాజెక్టు మరింత బలోపేతం చేయనుంది.

**తెలంగాణ జనసేన నేతలతో భేటీ**

ఆలయ అభివృద్ధి కార్యక్రమాల అనంతరం పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యకలాపాలపై దృష్టి సారించనున్నారు. కొడిమ్యాల సమీపంలోని బృందావనం రిసార్టులో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా, ఇటీవలి తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో విజయం సాధించిన ప్రతినిధులను ఆయన కలిసి, అభినందనలు తెలియజేయనున్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నారు.

# ఐక్యతతోనే శాంతి... శాంతితోనే అభివృద్ధి

- కుటుంబం నుంచి, దేశం వరకు అంతా ఏకతాటిపై ఉండాలి
- కుటుంబ వ్యవస్థే భారత్ బలం, గౌరవం
- ఎక్కడున్నా మన మూలాలను మరవకూడదు'
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- సింగపూర్ శ్రీ సాంస్కృతిక కళాసారథి ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా ప్రసంగం



**సింగపూర్, మహా :** దేశంలోని ప్రతిస్థాయిలోనూ ఐకమత్యంగా ఉండాలని, అప్పుడే వృద్ధి పథంలో దూసుకుపోగలమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం సింగపూర్‌లో "శ్రీ సాంస్కృతిక కళాసారథి" ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "కుటుంబంలో, సమాజంలో, దేశంలో ఐక్యత ఉన్నప్పుడే ప్రపంచం ప్రశాంతంగా ఉంటుంది. మనం ఐక్యంగా లేకపోబట్టే చరిత్రలో చిన్న చిన్న దేశాలు కూడా వచ్చిన మనల్ని ఆక్రమించి తిష్టవేశాయి. మన సంపదను దోచుకువెళ్లాయి. దేశంలో ఉన్న ప్రతిఒక్కరూ, నేతలందరూ ఐక్యంగా ఉండాలి. ఎన్నికల వరకే ప్రత్యర్థులు. ఆ తర్వాత అందరం భారతీయులం. ఐక్యంగా ఉంటే శాంతి ఉంటుంది. శాంతి ఉన్న చోటే అభివృద్ధి సాధ్యం. '' అని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. సింగపూర్ వంటి దేశాలు మనవారిని ఆదరించి అవకాశాలు కల్పిస్తున్నాయని, ఏ దేశంలో ఉన్నా అక్కడి నిబంధనలను, పద్ధతులను గౌరవించాలని సూచించారు. అదే సమయంలో మన మూలాలను మరిచిపోకూడదని చెప్పారు. "మన సంస్కృతి, మన భాష, మన యాస, మన కట్టు, మన బొట్టు, మన సంప్రదాయాలను మరచిపోకూడదు. కుటుంబ వ్యవస్థే మన బలం. ప్రపంచమంతా మనల్ని గౌరవిస్తోంది మన కుటుంబ వ్యవస్థను చూసే. దాన్ని కాపాడుకోవాలి. మన సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందించాలి.'' అని పిలుపునిచ్చారు. పాశ్చాత్య సంస్కృతి, ఎలక్ట్రానిక్ పరికరాల వ్యామోహంలో పడి కుటుంబాన్ని విస్మరించవద్దని సూచించారు. ముఖ్యంగా పిల్లలు తమ అమ్మమ్మలు, తాతయ్యలతో సమయం గడపాలని, వారి నుంచి జీవిత పాఠాలు నేర్చుకోవాలని చెప్పారు. పెద్దలు కూడా పిల్లలతో తగినంత సమయం గడపాలని సూచించారు.

"భాష పోతే శ్వాస పోతుంది" అంటూ మాతృభాషను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వెంకయ్యనాయుడు నొక్కి చెప్పారు. తెలుగులోని గొప్ప సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి అనువదించి ప్రపంచానికి అందించాలని విదేశాల్లోని తెలుగువారికి పిలుపునిచ్చారు. ప్రకృతితో మమేకమై జీవించాలని, సూర్యోదయానికే నిద్రలేవాలని, వ్యాయామం, యోగా చేయడం ద్వారా మనసు, శరీరం అదుపులో ఉంటాయని తెలిపారు. సిరిధాన్యాలు, సంప్రదాయ వంటకాలే మనకు బలమని, పిల్లలకు మన రుచులను అలవాటు చేయాలని సూచించారు. టీవీలకు అతుక్కుపోకుండా క్రీడలు, సంగీతం వంటి కళల్లో పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. సూర్యాస్తమయానికల్లా పనులు ముగించుకోవాలన్నారు. పండుగలు కేవలం వేడుకలు మాత్రమే కావని, అవి ఐక్యతకు గొప్ప వేదికలని పేర్కొన్నారు. ఒకప్పుడు ప్రపంచ జీడీపీలో పావు వంతు వాటా కలిగిన భారత్, పరాయి పాలనలో దోపిడీకి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. మన అల్లూరి సీతారామరాజు, రాణి రుద్రమదేవి వంటి వీరుల చరిత్రను నేటి తరానికి తెలియజేయాలన్నారు. మన మహనీయుల గొప్పతనాన్ని దాచి, పాశ్చాత్య వ్యక్తులు కొంతమందిని గొప్పవారిగా చరిత్రలో చిత్రీకరించారని, అందరినీ దోచుకుని, చంపుకుంటూ వెళ్లిన వారు గొప్పవారు ఎలా అవుతారన్నారు. చరిత్ర పుస్తకాల్లోని వక్రీకరణలను సరి చేసి మన మహనీయుల గురించి నేటితరానికి తెలియచేయడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత్‌లో ఎన్నికల ప్రక్రియను వేలెత్తి చూపడం సరికాదని అన్నారు. ఓడితే ఈవీఎంల తప్పు అంటున్న కొంతమంది.. అదే ఈవీఎంల ద్వారా గెలిచినప్పుడు వాటిని తప్పుబట్టడం లేదని విమర్శించారు. భారత ఆర్థిక వ్యవస్థపై అవాంఛిత వ్యాఖ్యలు చేసేవారికి మన అభివృద్ధి ద్వారానే ప్రధాని మోదీ తగిన సమాధానం చెబుతున్నారని అన్నారు. భారత్ మళ్లీ 'విశ్వగురువు' కావాలని, అది జ్ఞానాన్ని పంచడానికే తప్ప ఆక్రమణల కోసం కాదని స్పష్టం చేశారు. ఏఐ వినియోగాన్ని ఆపలేమని, అయితే దాని దుర్వినియోగాన్ని అరికట్టేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాజిక సంతోషానికి కొన్ని కఠిన నిబంధనలు, నియంత్రణలు అవసరమని, అందుకే సింగపూర్ తనకు నచ్చుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగపూర్‌లో భారత హైకమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు



### జల వివాదాల పరిష్కారానికి కేంద్రం

# సంపూర్ణ సహకారం

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**న్యూఢిల్లీ, మహా :** జల వివాదాల పరిష్కారానికి కేంద్రప్రభుత్వం సంపూర్ణ సహకారం అందజేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి ఓ కమిటీని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఆ కమిటీని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ నోటిఫై చేసిందని తెలిపారు. కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా తెలుగురాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు ఉన్నారని వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీజలాల వినియోగంలో నెలకొన్న వివాదాల పరిష్కారానికి సంబంధించిన కమిటీని ఇవాళ కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నోటిఫై చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం.. సహకార సమాఖ్య విధానంతో.. గత 11 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాల పరిష్కారానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని చెప్పుకొచ్చారు. ఇందుకోసం ప్రత్యేకమైన వేదికలను ఏర్పాటుచేసి సమన్వయంతో సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.




### జీహెచ్ఎంసీ వార్డుల విభజనలో

# సమస్యలుంటే పరిష్కరిస్తాం

### మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, మహా :** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే గ్రేటర్ హైదరాబాద్‌లో ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలను విలీనం చేశామని ప్రభుత్వం తెలిపింది. జీహెచ్ఎంసీని మళ్లీ ఎన్ని కార్పొరేషన్లుగా విభజిస్తామో ఇంకా నిర్ణయించలేదని అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకెళ్తామని స్పష్టం చేసింది. పురపాలకజీహెచ్ఎంసీ, మోటారు వాహనాలు, తెలంగాణ ప్రైవేటు వర్సిటీల చట్ట సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. శాసనసభలో ఈరోజు మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ జరిగింది. పురపాలకజీహెచ్ఎంసీ, మోటారు వాహనాలు, తెలంగాణ ప్రైవేటు వర్సిటీల చట్ట సవరణ బిల్లులను మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. జీహెచ్ఎంసీలో శివారు మున్సిపాలిటీల విలీనం పూర్తిగా అశాస్త్రీయంగా, ఆదరాబాదరాగా జరిగిందని బీజేపీ విమర్శించింది. గ్రామీణ ప్రాంతాలను జీహెచ్ఎంసీలో కలపడం వల్ల అక్కడి ప్రజలు అన్నివిధాలుగా నష్టపోతారని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు.

**జీహెచ్ఎంసి విభజనపై నిర్ణయం తీసుకోలేదు**

పురపాలక, జీహెచ్ఎంసీ చట్ట సవరణ బిల్లులపై జరిగిన చర్చకు మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం ఇచ్చారు. జీహెచ్ఎంసీని మళ్లీ ఎన్ని కార్పొరేషన్లుగా విభజిస్తామో ఇంకా నిర్ణయించలేదని అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకెళ్తామని చెప్పారు. సిబ్బంది కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని 8 మంది జోనల్ కమిషనర్లను నియమించినట్లు వివరించారు. జీహెచ్ఎంసీలో విలీనం వల్ల ఉపాధి హామీ పథకాన్ని కోల్పోయే గ్రామాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలంగాణ ప్రైవేటు వర్సిటీల చట్ట సవరణ బిల్లు, మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లు పైనా శాసనసభలో చర్చ జరిగింది. మంత్రుల సమాధానం తర్వాత పురపాలక, జీహెచ్ఎంసీ చట్ట సవరణ బిల్లు, మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ ప్రైవేటు వర్సిటీల చట్ట సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది.

**సిటీలో ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే**

ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 174 పాయింట్లు ఉందన్న మంత్రి శ్రీధర్ బాబు నగరంలో గాలి నాణ్యత మున్ముందు మరింత పడిపోకూడదని భావిస్తున్నామన్నారు. కాలుష్యం నియంత్రణకే నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలించే ప్రక్రియ చేపట్టామని తెలిపారు. హైదరాబాద్‌లో మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తామని శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్‌ను 360 డిగ్రీలు కవర్ చేసేలా మెట్రో విస్తరణ చేపట్టాలని నిర్ణయించామన్నారు. అనుమతులు, నిర్వహణలో సమస్యలు రావొద్దనే మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేస్తోందని శ్రీధర్‌బాబు వివరించారు. జీహెచ్ఎంసీ వార్డుల విభజనలో సమస్యలుంటే పరిష్కరిస్తామని ఆయన వెల్లడించారు. 8 మంది జోనల్ కమిషనర్లను నియమించామన్నారు. హైదరాబాద్ పరిపాలన కోసం ప్రత్యేకంగా ఇద్దరు ఐఏఎస్ అధికారులను నియమించామని తెలిపారు.

EDITORIAL
సంపాదకీయం

# రాజకీయ దురుద్దేశంతోనే
# రాహుల్‌పై కేసులు

ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ స్పెషల్ కోర్టు నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్ ను కొట్టివేసిన విషయం దేశ ప్రజలందరికీ తెలిసిందే. ఈ కేసును ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కింద విచారణ చేయడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పెషల్ జడ్జి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. ఈ వ్యాఖ్యలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీల నిజాయితీ, నైతికతకు మరింత ఊతమిచ్చాయి.



స్వాతంత్ర్యోద్యమం జరుగుతున్న 1938లో జవహర్ లాల్ నెహ్రూ "ది నేషనల్ హెరాల్డ్" ఆంగ్ల పత్రికను స్థాపించారు. ఈ పత్రిక దేశ ప్రజల స్వాతంత్ర్య ఆకాంక్షలకు ఒక గొంతుగా ఉపయోగపడింది. నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ పత్రికపై అనేకసార్లు నిషేధం విధించింది. 90వ దశకం వచ్చేవరకు ఈ పత్రిక ప్రభావం తగ్గి మూతపడింది. తిరిగి మళ్లీ ప్రారంభమైనా ఆర్థిక ఇబ్బందులతో 2008లో పూర్తిగా మూతపడింది.

నెహ్రూ స్థాపించిన ఈ పత్రికను తిరిగి ప్రారంభించాలనే ఉద్దేశంతో 2010లో కాంగ్రెస్ పార్టీ "యంగ్ ఇండియా ప్రైవేట్ కంపెనీ"ని స్థాపించింది. ఇందులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, శ్యాం పిట్రోడా, సుమన్ దూబే, సునీల్ బండారి తదితరులు వాటాదారులు. యంగ్ ఇండియా కంపెనీలో నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తులను కలిపారు. దీంతో పత్రిక తిరిగి ప్రారంభమైంది. 2012లో బిజెపి నేత సుబ్రహ్మణ్యం స్వామి నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తులను మనీలాండరింగ్ చేశారని, గాంధీ కుటుంబం ఈ ఆస్తులను స్వాధీనం చేసుకుందని సిబిఐ, ఈడీలకు ప్రైవేటు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి గత 13 ఏళ్లుగా ఈ కేసు కొనసాగుతుంది. ఇది రాజకీయ దురుద్దేశంతో వేసిన కేసు మాత్రమే. ఇందులో మనీ లాండరింగ్ జరిగిందని ఎలాంటి ఆధారాలు లేవు. గాంధీ కుటుంబం పత్రిక ఆస్తులను వారి పేరు మీద మార్చుకున్నారని ఒక్క ఆధారం కూడా నేటికీ లభించలేదు. ఈ కేసు వేసిన సుబ్రహ్మణ్యం స్వామికి మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజ్యసభ పదవిని కట్టబెట్టారు. గాంధీ కుటుంబాన్ని అవినీతిపరులుగా చూపడం, వారి మీద రాజకీయ బురద జల్లడం కోసం ఈ కేసును బిజెపి ప్రభుత్వం వాడుకుంది. కృత్రిమ సాక్ష్యాలను సృష్టించి రాహుల్ గాంధీని జైలుకు పంపాలని అనేక ప్రయత్నాలు చేసింది. కానీ రాహుల్ గాంధీ మొక్కవోని ధైర్యంతో, నిజాయితీతో వీటన్నిటినీ ఎదుర్కొంటున్నాడు. దేశంలోని పేద, దళిత, బడుగు బలహీన, మైనార్టీ ప్రజల గొంతుగా ఉన్న రాహుల్ గాంధీని ఇబ్బందులకు గురి చేయడమే ఈ అక్రమ కేసు లక్ష్యం. దీనికోసం గోదిమీడియా ద్వారా నిరంతరం గాంధీ కుటుంబం మీద విషం చిమ్ముతూనే ఉన్నారు.

గత 11 ఏళ్లుగా దేశాన్ని ఏలుతున్న మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై సిబిఐ, ఈడి కేసులను బనాయిస్తుంది. బిజెపిలో చేరిన ఆ నాయకులపై కేసులు నీరుగారేలా చేస్తుంది. కానీ బిజెపికి భయపడకుండా నిలబడ్డ ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపుతుంది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ ను ఐదు నెలలు జైలుకు పంపింది. నాడు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ను జైలుకు పంపింది. ఇలా గత పదకొండు ఏండ్లలో మొత్తం 50 మంది ప్రతిపక్ష నాయకుల మీద ఈడీ కేసులను నమోదు చేసింది. ఈడి ఇప్పటివరకు నమోదు చేసిన కేసులలో నేరం నిరూపణ అయి, శిక్షపడ్డ కేసులు ఒక శాతం లోపే. అంటే మిగతా 99 శాతం రాజకీయ దురుద్దేశంతో బనాయిస్తున్న కేసులే అన్నమాట. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీని, రాహుల్ గాంధీని ఈడి అనేకసార్లు విచారణ చేసింది. ఈ కేసులో రాహుల్ గాంధీని ఈడి 50 గంటలకు పైగా విచారణ చేసింది. కానీ బిజెపి నేతలపై వచ్చే అవినీతి ఆరోపణల మీద సిబిఐ గానీ, ఈడీ గానీ విచారణ చేయవు. అంతెందుకు నేషనల్ హెరాల్డ్ కేసు వేసిన బిజెపి నేత సుబ్రహ్మణ్యం స్వామి ప్రస్తుత ప్రధాని మోడీపై అనేక ఆరోపణలు చేస్తున్నారు. వీటిపై సి.బి.ఐ లేదా ఈడి గాని ఎలాంటి విచారణ చేయడం లేదు. బ్యాంకులకు వేలకోట్లు ఎగ్గొడుతున్న కంపెనీలపై ఈడి విచారణ చేయడం లేదు. ఏందుకంటే ఆ కంపెనీలు బిజెపికి ఎన్నికల విరాళాలు ఇస్తున్నాయి కాబట్టి. వేలకోట్ల దేశ ప్రజల సొమ్మును దోచుకొని విదేశాలలో విలాసవంతమైన జీవితం గడుపుతున్న పెట్టుబడిదారులకు ఇంతవరకు ఎలాంటి శిక్షలు పడలేదు. కానీ దేశ ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై వందల సంఖ్యలో కేసులు నమోదు చేసిన తీరు ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎంత విషప్రచారం చేసినా గాంధీ కుటుంబం దేశానికి చేసిన సేవ, వారి త్యాగం ముందు అవి నిలబడవు. దానికి రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పే నిదర్శనం. దేశ ప్రజల హృదయాలలో గాంధీల స్థానం ఏప్పటికీ చిరస్మరణీయం.



**- నుమాన్ మహమ్మద్,**
ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్
ఫోన్: 99082 79090





# గిరిజనుల దేవత జంగుబాయి జాతర
# సంబరాలలో ఆదివాసీలు

**ఆదిలాబాద్ మహా:** ఆదివాసీలకు ప్రకృతితో విడదీయరాని బంధం ఉంది, అడవే వారి జీవనాధారం, వారి భాష, వేషధారణ, పూజలు, పండుగలు అన్నీ ప్రకృతితో ముడిపడి ఉంటాయి, ముఖ్యంగా పుష్య మాసంలో జంగుబాయి అమ్మవారిని పూజిస్తారు, ఈ జాతర నెలవంక కనిపించిన వేకువజామున మొదలై నెల రోజుల పాటు కొనసాగుతుంది, వివిధ రాష్ట్రాల నుంచి లక్షల మంది భక్తులు ఈ జాతరకు వస్తారు. వారి భాష, వేషధారణ, పూజలు, పండుగలు ప్రత్యేకంగా ఉంటాయి. ఈ జాతర, వారి జీవనశైలికి ఆదివాసీ సంస్కృతికి అద్దం పడుతుంది, వారి నమ్మకాలు, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది.తెలంగాణ,మహారాష్ట్ర సరిహద్దులోని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం మహరాజ్ గూడ సమీపంలోని సహ్యాద్రి పర్వతాల్లోని గుహలో సహజసిద్ధంగా కొలువైన జంగుబాయి అమ్మవారిని ఆదివాసీలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తుంటారు. వేల ఏండ్ల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రంలో ప్రతి ఏటా జాతరను నిర్వహిస్తుంటారు. మన రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ తదితర రాష్ట్రాల నుంచి ఆదివాసీలైన గొండులు, పర్ధాన్, కోలాం తెగలకు చెందిన ప్రజలు దర్శించుకుంటారు. పుణ్యక్షేత్రంలో 8 గోత్రాల కటోడాలు సంప్రదాయం ప్రకారం కఠిన నియమాలతో జాతర పూర్తయ్యే దాకా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు.

## దీపోత్సవంతో మొదలు

ఎనిమిది గోత్రాల కటోడాల ఆధ్వర్యంలో ముందుగా దీపోత్సవంతో ప్రారంభిస్తారు. తుమ్రం, కొడప, సలాం , రాయిసిడాం, హెర్రె కుమ్ర, మరప, వెట్టి, మందడి.. ఇలా ఎనిమిది గోత్రాల కటోడాలు (పూజరులు) తొలిరోజు కాలినడకన పూజా సామగ్రి తీసుకెళ్లి అదే రోజు రాత్రి దీపారాధన చేసి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఇలా జాతర ముగిసే వరకు పూజలు కొనసాగిస్తుంటారు. జాతర జరిగే రోజుల్లో ఆదివాసీలు ఉదయం తమ ఇండ్ల ముందు ఆవుపేడతో అలుకు చల్లుతారు. ఇంటి ఆవరణలోకి చెప్పులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. కాళ్లకి చెప్పులు కూడా వేసుకోరు. నేలపైనే పడుకుంటారు. మద్యం అసలే ముట్టుకోరు. కనీసం హోటల్లో నీటిని కూడా ముట్టుకోరు. ఇంటి నుంచి కాలినడకన ఆలయానికి చేరుకుం టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు మధ్యలో బస చేయాల్సి వస్తే గంపను నేలపై ఉంచ కుండా మూడు బండలను పేర్చి గో మూత్రంతో శుభ్రం చేసిన తర్వాత రాళ్లపై పెడతారు.జాతరకు వెళ్తూ మధ్యలో టోప్లకస (కోనేరు) లో పుణ్యస్నానాలు చేసి ఆలయానికి చేరుకుంటారు.

## నైవేద్య సమర్పణ

ఆదివాసీ రైతులు పండించిన వడ్లను దంచి బియ్యం సేకరిస్తారు. గోధుమ పిండి, పప్పు, బెల్లంతో పాటు నువ్వుల నూనెతో నైవేద్యం వండుతారు. దీపారాధనకు నువ్వుల నూనె, నెయ్యి ,ఆముదం వినియోగిస్తారు. గంపలో కొబ్బరికాయ, ఆగరవర్తులు,చంద్రం, గుగ్గిలం, కుంకుమ, గులాలు, వంట సామగ్రి పెట్టుకుని సంప్రదాయ వాయిద్యాలతో తరలివెళ్తారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు.అనంతరం మైసమ్మ, పోచమ్మ, రావుర్క్ వద్ద మొక్కులు చెల్లించుకుంటారు. రాత్రి వంటలు చేసుకుని భోజనాలు చేసి ఆట పాటలతో అమ్మవారిని ఆరాధిస్తుంటారు.







**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

ANN తెలుగు

మహా పత్రిక

05

శనివారం, హైదరాబాద్ | 03-01-2026 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM



## రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండలం సింగం పల్లి గ్రామ సర్పంచ్ సత్యం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. సింగంపల్లి నుంచి పోలేపల్లి గేట్ వరకు జేసీబీ సహాయంతో రోడ్డు మరమ్మతు చేసి గ్రామస్థులు వాహన దారులకు ఇబ్బందులు తొలగించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీంద్ర, వార్డు మెంబర్స్ నర్సింహ, అయోధ్య, తానేష, మంజుల, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరలు పంపిణీ

**ఆమనగల్లు, మహా:** అమనగల్లు మండలం మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్,ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మహిళల అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని అన్నారు. అందులో భాగంగా మహిళలకు ఉద్దేశించిన అనేక పథకాలను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్నదని ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిందని తెలిపారు.గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,500 రూ"లకే గ్యాస్ సిలిండర్లు, సొంత ఇల్లు లేని మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నదని వారు వివరించారు,మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామీగ నిలువాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మల్లేష్,ప్రేమలత,జయందర్,సితి,కవిత,సీతారాం, దేవేందర్, పంచాయతీ కార్యదర్శి జగన్.నాయకులు హరిలాల్,సురేష్,హన్మ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.3 లక్షల విరాళం

**ఆమనగల్లు, మహా:** ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అర్థం లక్ష్మయ్య గుప్తా పుట్టినరోజు సందర్భంగా కడ్తాల్ మండలంలోని ముద్విన్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం రూ. 3, లక్షల విరాళం ఎస్సై వరప్రసాద్ కు అందజేశారు. అదేవిధంగా మండలంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సేవా దృకృథంతో మరింత సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. అనంతరం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అర్థం వాసుదేవ్ గుప్తా, నాయకులు చింతల వెంకటయ్య గుప్తా, వేముల రమేష్, అర్థం చంద్రయ్య, అర్థం రమేష్, అర్థం రవి, మండల కోశాధికారి కరుణాకర్, ఎస్సై వరప్రసాద్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ దోనాదుల కుమార్, జోగు వీరయ్య, సతీష్, ముద్విన్ మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ వినోద్ తదితరు పాల్గొన్నారు.



## రవీందర్ నాయక్ కలిసిన బాబా

**ఆమనగల్లు, మహా:** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ ను శుక్రవారం కెఎన్ఆర్ సేవాదళం బాబా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన చాంబర్ లో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే శ కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేకచొరవతో నిర్మాణ తుదిదశకు చేరిన ఆమనగల్లు పట్టణంలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్ ను త్వరగా వినియోగంలోకి తెచ్చి నాలుగు మండలాల పేదలకు మేలు చేకూర్చాలని కోరినట్లు బాబా తెలిపారు.

# అసెంబ్లీలో మల్ రెడ్డి ఆగ్రహం!

- జిల్లా రూపురేఖలు మార్చే తీరు సరైనది కాదు
- జిల్లా అస్తిత్వాన్ని దెబ్బతీసేలా మార్పులు
- ప్రజలకు అనుగుణంగా పాలన అందించాలి
- తుర్కయంజాల్ సర్కిల్ ను యధావిధిగా కొనసాగించాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గ్రేటర్ హైదరాబాద్ పునర్వ్యవస్థీకరణ పేరుతో రంగారెడ్డి జిల్లా అస్తిత్వాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం జిహెచ్ఎంసి విస్తరింపజేసి, రంగారెడ్డి జిల్లా అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని జిల్లా రూపురేఖలు మారుస్తూ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని, శుక్రవారం అసెంబ్లీలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి విస్తరణ పేరుతో మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను విలీనం చేస్తూ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఓ సర్కిల్ గా ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం ప్రజాభిప్రాయం సేకరించకుండా తుర్కయంజాల్ సర్కిల్ను, ఆదిభట్ల సర్కిల్లో విలీనం చేయడంపై ఆయన మండిపడ్డారు. దీంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో అధికారులు ఏమి చేయలేని పరిస్థితిలో ఉండడం గమనార్హం. ప్రజల పాలన సౌలభ్యం కోసం ఏర్పాటుచేసిన తుర్కయంజాల్ సర్కిల్ ను యధావిధిగా కొనసాగించాలని, ఎమ్మెల్యే రంగారెడ్డి అసెంబ్లీలో స్పీకర్ ప్రసాదరావును, జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబును కోరారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నపించడం జరిగింది.

## పరిశోధనలు జాతీయ అభివృద్ధికి ఎంతో కీలకం

**చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఆచార్య ఏం. జగదీశ్వర్**

**మొయినాబాద్ మహా:** పరిశోధనలు జాతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని, చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఆచార్య ఏం. జగదీశ్వర్ పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో "ఇన్వెస్టిగేషన్ ఆన్ టోపోలాజీస్ అండ్ కంట్రోల్ అఫ్ రెడ్యూస్డ్ స్విచ్ కౌంట్ మల్టీలెవెల్ ఇన్వెర్టర్స్ ఫర్ వేరియస్ అప్లికేషన్స్ " అనే సిద్ధాంతానికి రుమన అబిదిన్ కు పీహెచ్ డీ డిగ్రీ పట్టా లభించగా.. శుక్రవారం యూనివర్సిటీ ఆచార్య ఏం. జగదీశ్వర్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ పరిశోధన డాక్టర్ దోనపాటి రామకృష్ణ రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. దీంతో యూనివర్సిటీ ఛాన్సలర్, ఫౌండర్ సీహెచ్.వీ.పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్. సాత్వికరెడ్డిలు అభినందించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆచార్య ఏం. జగదీశ్వర్ మాట్లాడుతూ..సమాజంలో సాధారణ ప్రజల అవసరాలు,సమస్యలు, భవిష్యత్తు సవాళ్లలను దృష్టిలో పెట్టుకొని పరిశోధనలు జరిపితే దాని ఫలితాలు నేరుగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని అన్నారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగంలో జరిగే పరిశోధనలు దేశ అభివృద్ధికి ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, పునరుత్పాదక శక్తి వనరులు, స్మార్ట్ బ్రిడ్జ్ ఎలక్ట్రిక్ వాహనాలు, ఆటోమేషన్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ వంటి రంగాల్లో కొత్త సాంకేతికతలు అభివృద్ధి కావడానికి ఈ పరిశోధనలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ రంగంలో జరిగే పరిశోధనల వల్ల పరిశ్రమలు మరింత సామర్థ్యవంతంగా పనిచేయగలుగుతాయని, శక్తి వినియోగం తగిన వనరుల ఆదా జరుగుతుందని, అన్నారు. అలాగే ఉపాధి అవకాశాలు పెరగడం ఆర్థిక వృద్ధి సాధ్యమవడం ద్వారా దేశం సాంకేతికంగా, ఆర్థికంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో పరిశోధనలు దేశ ప్రగతికి బలమైన పునాది అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీ. శంకర్ లింగం, రిజిస్ట్రార్ ఆచార్య యం.రవీందర్, క్రిస్టోఫర్, ఏ.రాజు, సీహెచ్. ప్రత్యూషరెడ్డి, బి. రాజేందర్ రెడ్డి, ఈ.జగదీష్ కుమార్, బి.చంద్రమౌళి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## నూతన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా చేపూరి ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవం

**రాజేంద్రనగర్ మహా ;** కాంగ్రెస్ పార్టీ పెద్ద తూప్ర గ్రామ కమిటీ అధ్యక్షునిగా చేపూరి ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన సీనియర్ నాయకులు చంద్రారెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. వారి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో గ్రామ కమిటీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపడడానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించేందుకు కృషి చేస్తానన్నారు. తన వెన్నంటే ఉండి తనకు సహకరించిన గ్రామ నాయకులకు మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలకమర్రి మహేందర్, బొద్దం అంజయ్య, అశోక్ కుమార్, దిద్యాల అశోక్, మాజీ సర్పంచ్ యాదయ్య, కటుకూరి కృష్ణ, ఎం.డీ. గౌస్, మైల విద్యా చరణ్, కేతావత్ శ్రీను, శివయాదవ్, ఎండి.హాజీ పాషా తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపానికి భూమి పూజ

**ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్. మహా:** షాద్ నగర్ పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ సమీపంలో అమరవీరుల స్థూపం నిర్మా నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమరవీరులు, ఇప్పుడున్న ఉద్యమకారులు నిజమైన తెలంగాణను ఆకాంక్షించిన వ్యక్తులని ప్రశంసించారు. అలాంటి వ్యక్తులకు బీఆర్ఎస్ హయాంలో కనీస గౌరవం దక్కలేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాగో అమరవీరులకు సరైన గౌరవం దక్కలేదని, ప్రస్తుత ప్రభుత్వమైన వారి కుటుంబాలకు అండగా ఉండాలని కోరుకుంటున్నానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అమరవీరుల స్తూపం ప్రతిపాదనను తన వద్దకు తెచ్చినప్పుడు తాను వెన్నంటి ఉంటానని హామీ ఇచ్చానని, ప్రస్తుతం దీనిని వీలైనంత త్వరగా పూర్తి చేయడమే లక్ష్యమని వెల్లడించారు. ఎలాంటి కార్యక్రమాలైనా జరుపుకునేందుకు వీలుగా ఈ స్థూపం వద్ద ఒక వేదిక కూడా నిర్మిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ టిజెఎసి చైర్మన్ జనార్ధన్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి వెంకట్ రాంరెడ్డి, టిజెఎసి నేత షాద్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కర్ణకర్, తెలంగాణ ఉద్యమ కారులు మంగులల్ నాయక్, ఎమ్మే సతయ్య, టీజేఏసీ నేతలు రామరావు, ఎం వెంకట్ రెడ్డి, నక్క బాలరాజు, తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ కో కన్వీనర్ జాంగారి రవి , టిజెఏసి రాష్ట్ర నేత శ్రీనివాస్ రాజు, సంఘాల నేతలు తిరుమలయ్య, హెల్త్ శ్రీనివాస్, సత్యం,పులి మామిడి విరంజయ్య గౌడ్,అర్జునప్ప, బాధేపల్లి సిద్ధార్థ, టెలిఫోన్ వెంకటయ్య, రవీంద్రనాథ్, గౌర్ల రాము, మేకల వెంకటేష్, అన్నారం బాలు నాయక్, అదెట్ల రాజు, మందారం నర్సింహులు, నర్సింహులు, కృష్ణ, సోలిపుర్ శివ, తెలంగాణ అమరుడు పాపకంటి శేఖర్ సోదరుడు కృష్ణ, తెలంగాణ జర్నలిస్ట్ ఉద్యమ కారులు మోహన్ రెడ్డి, ఖాజా పాషా(కెపి), భవాని వేణు గోపాల్, కాంగ్రెస్ పార్టీ నేతలు రఘు నాయక్, చెంది తిరుపతి రెడ్డి, బాలరాజు గౌడ్, అగ్గనూర్ బస్వం, జాకారం చంద్ర శేఖర్, మురళీ మోహన్ అప్పీ, మాణిక్యం, లింగారెడ్డి గూడ అశోక్, సీతారాం, శుక్ర వర్ధన్ రెడ్డి, గంట్ల వెల్లి గ్రామ సర్పంచ్ శివ కుమార్, మంచి రేవుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.



## అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 44వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు..**

**రాజేంద్రనగర్, మహా :** ఏబీవీపీ రాష్ట్ర 44వ మహాసభల సందర్భంగా ఏబీవీపీ నాయకులు శుక్రవారం ప్రవేట్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 44వ రాష్ట్ర మహాసభలను జనవరి 3 నుంచి 5వ తారీఖు వరకు శంషాబాద్ లోని ఎస్ ఎస్ ఆర్ గార్డెన్ లో నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు 3 తేదీన ఉద్ఘాటన కార్యక్రమం ఉంటుంది. కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, సంఘటన మంత్రి ఆశిష్ చౌహాన్ పాల్గొంటారు. రాష్ట్ర సంక్షేమ గురుకులాల్లో జరుగుతున్న పరిస్థితుల పైన పలు తీర్మానాలను ప్రవేశపెడతారు. రాష్ట్ర స్థితిగతుల పైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో తీసుకోనున్న పలు అంశాలను తీర్మాన రూపంలో ప్రవేశపెట్టనున్నారు. మూడో తారీకు నుంచి ఐదో తారీకు వరకు 44వ మహాసభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిడబ్ల్యుసి మెంబర్ సందీప్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి శ్రీరామ్, స్టేట్ జాయింట్ సెక్రెటరీ ఆకాష్ బాటీ, సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సోనీ, శంషాబాద్ టౌన్ సెక్రెటరీ భరత్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ బడులను బాగు చేయాల్సింది సంఘాలే

- ఫరూక్ నగర్ మండల విద్యాధికారి మనోహర్
- టీఎస్ యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ విడుదల

**షాద్ నగర్. మహా:** ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్య పెంచి, వారి సామర్థ్యాన్ని పెంచి, సమస్యలు తీర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయ సంఘాల పైన ఉందని ఫరూక్ నగర్ మండల విద్యాధికారి మనోహర్ అన్నారు. టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల హాజరు నమోదు శాతం పెంచే విధంగా కృషిచేసి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ తమ సంఘం సామాజిక బాధ్యతతో పనిచేస్తుందని అన్నారు. పెండింగ్లో ఉన్న డీ ఏ లు, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పిఆర్సి పెంపు వంటివి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ.. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు రావలసిన బెనిఫిట్స్ వెంటనే అందేలా కృషి చేయాలి అన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం మానవతా దృకృథంతో నిర్ణయం తీసుకోవాలని కోరారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలన్నారు. పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులు తమకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం ఎదురుచూసి తీవ్ర ఆవేదనకు గురై మరణాలు కూడా సంభవిస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. అధ్యక్షులు లక్ష్మీదేవమ్మ, ప్రధాన కార్యదర్శి సత్యం, ఉపాధ్యక్షులు సురేందర్, అరుణ, బాలయ్య, కృష్ణ ,భరత్ కుమార్, నర్సింలు, కృష్ణయ్య, సతీష్, శ్రీనివాస్ ,శివరాములు, సమత, పరమేశ్వరి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## అధిబట్ల సర్కిల్ కార్యాలయాన్ని రాగన్నగూడకు తరలింపు!

- కార్యాలయ మార్పుపై మండిపడ్డ శ్రీనివాస్ గౌడ్ పలువురు నాయకులు..
- యధాతధంగా అధిబట్లలోనే పరిపాలన కొనసాగించాలి
- లేదంటే ఆందోళనలు ధర్నా చేపడతాం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** అధిబట్ల సర్కిల్ కార్యాలయాన్ని రాగన్నగూడకు మార్చడం పై తీవ్ర స్థాయిలో మండిపడ్డ శ్రీనివాస్ గౌడ్ పలువురు నాయకులు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆదిభట్ల సర్కిల్ 15, కార్యాలయాన్ని ఆదిభట్ల నుండి తుర్కయంజాల్ ప్రాంతంలోని రాగన్నగూడ వార్డు కార్యాలయానికి మార్పు చేయడంపై పల్లె శ్రీనివాస్ గౌడ్ తో పాటు పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధిబట్ల శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో ప్రజలకు అందుబాటులో ఉన్న కార్యాలయాన్ని, రాగన్నగూడకు మార్చడం ఏమిటి అని ప్రశ్నించారు. రాగన్నగూడలో ఏమి సదుపాయాలు ఉన్నాయని, అక్కడికి మార్చే అవసరం ఏమి వచ్చిందని మండిపడ్డారు. యదాతధంగా ఆదిబట్లలో సర్కిల్ కార్యాలయాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి హెచ్చరించారు. లేని పరిస్థితిలో శ్రీనివాస్ గౌడ్ తోపాటు నాయకులు ప్రజలు నిరసనలు, ఆందోళనలు చివరకు ధర్నాకు కూడా వెనుకడబోమని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.

## చట్టాలు, న్యాయవ్యవస్థపై న్యాయవాదులు ప్రజలకు అవగాహన కల్పించాలి: ఎంపీ, ఎమ్మెల్యే

**ఆమనగల్లు, మహా:** చట్టాలు, న్యాయవ్యవస్థ పై న్యాయవాదులు ప్రజలకు అవగాహన కల్పించాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ తమ వంతు పాలుపంచుకోవాలని వారు కోరారు. ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండే కార్ యాదిలాల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ,డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాదులోని ఎంపీ, ఎమ్మెల్యేల నివాసాలలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాదులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాది, కల్వకుర్తి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్ష్మణ శర్మ, హైకోర్టు న్యాయవాది లింగం గౌడ్ , టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్,, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి , కడ్తాల్ సర్పంచ్ రాయి కంటి బిక్షపతి ,ఉపసర్పంచ్ ఈ రెడ్డి యాదగిరి రెడ్డి , తలకొండపల్లి పిఏసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి లతో కలిసి వాటిని మల్లు రవి, కసిరెడ్డి నారాయణరెడ్డిలు ఆవిష్కరించారు. ప్రతి ఏటా డైరీలు, క్యాలెండర్లను రూపొందించి ప్రజలకు అందిస్తున్న యాది లాల్ ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా చైతన్య కార్యక్రమాలలో మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, న్యాయవాదులు పాలుపంచుకోవాలని కోరారు. ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అనువైన స్థలాలు కేటాయించి భవనాల నిర్మాణం చేపడతామని వారు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలందరి ఆకాంక్షల కనుగుణంగా పనిచేస్తుందని మల్లురవి, నారాయణరెడ్డి లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్ది రామిరెడ్డి, రాజిరెడ్డి, దస్తగిరి, విజయ్, సురేందర్ రెడ్డి , పాండు, శేఖర్ గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.



## మిస్టీరియస్ సినిమాను ప్రతి ఒక్కరు చూడాలి

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు పట్టణానికి చెందిన ఉప్పు రాము ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా నిర్మించిన మిస్టీరియస్ సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలని మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర టాకీస్ లో ప్రదర్శించిన సినిమాను వీక్షించి ఉప్పు రాము ను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో కుటుంబాలు ఏరకంగా చిదిరం అవుతున్నాయని కళ్ళకు కట్టినట్లు చూపించారన్నారు. నేటి సమాజానికి కావాల్సిన ముఖ్యమైన చిత్రం చిన్న చిన్న డైరెక్టర్లు గొప్ప ఆలోచనతో సమాజంలో మార్పు తేవడానికి వారియొక్క శ్రమకు సమాజం ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రేవల్లి రాజు, జంతుక శంకర్, నాగిళ్ళ జగన్, పూసల భాస్కర్,ప్రభు శంకర్, నాజర్, శ్రీను నాయక్, కోట రాములు, హిమానియాల్, ఉప్పు సురేష్, పాలధి శ్రీను, ప్రేమ్, రమేష్, ప్రవీణ్, కొర్ర మహేష్ తదితరులు ఉన్నారు.



## ఢిల్లీ విమాన సర్వీసులు పొగ మంచు కారణంతో రద్దు

**హైవే రోడ్లపై కమ్మేసిన పొగ మంచు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు**

**రాజేంద్రనగర్, మహా ;** భారీ పొగ మంచుతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్లవలసిన, రావలసిన పలు విమాన సర్వీసులు రద్దు చేయబడ్డాయి. తీవ్ర పొగ మంచు కారణంతో నేషనల్ హైవేలు, ఔటర్ రింగ్ రోడ్ దారులో వెళ్లే వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి శంషాబాద్ శివారు ప్రాంతాల్లో రహదారులన్నీ పొగ మంచుతో కప్పబడ్డాయి. ఈ నేపథ్యంలో దూర ప్రయాణాలు చేసేవారు పొగ మంచు కారణంతో ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలు బారులు తీరాయి. నేషనల్ హైవేలు రింగ్ రోడ్డు లో వెళ్లే వాహనాలు ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ఎక్కడికక్కడే వాహనాలు స్తంభించిపోయాయి. రోడ్డు పక్కకు వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. నెమ్మదిగా నడిపిస్తూ మెల్లి మెల్లిగా ట్రాఫిక్ ని అధిగమించారు.



## కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.!

- అసైన్డ్ భూమి రైతులకు శాశ్వత పట్టాలి ఇవ్వాలి....
- పేదల భూములు లాక్కోవాలని చూస్తే సిపిఎం ఊరుకోదు
- సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రేగడి దోస్వాడ, మక్తగూడ అసైన్డ్ భూమి రైతులకు శాశ్వత పట్టాలి ఇవ్వాలని అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండల పరిధిలోని రేగడి దోసాడ, మక్తగూడ గ్రామాలలోని అసైన్డ్ భూమి పేద రైతులకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని షాబాద్ ఎమ్మార్వోను, గ్రామాల ప్రజలందరూ కోరడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... ప్రభుత్వం పేదల దగ్గర భూములు లాక్కొని బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పాలని ప్రభుత్వం దుర్మార్గంగా ఆలోచిస్తుందని దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలిస్తామని హామీ ఇచ్చారని, వెంటనే రైతులందరికీ శాశ్వత పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వేనెంబర్ 102లో గల భూమి పచ్చని పంట పొలాలు ఉన్నాయని, వ్యవసాయానికి యోగ్యమైనటువంటి భూములను ప్రభుత్వం లాక్కోవాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. పేద రైతులందరూ పొలాలలో బోర్లు వేసుకొని సాగు చేసుకుంటున్నారు. పశుపోషణ ద్వారా సమాజానికి పాల ఉత్పత్తులు అందిస్తున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం దుర్మార్గమైనటువంటి ఆలోచనను విరమించుకోవాలని లేనిపక్షంలో ఆందోళన పోరాటాల నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రేగటి దోసాడ, మక్తగూడ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యానికి నిలువుటద్దం చింతపల్లిగూడ పార్క్!

- అధ్వానంగా మారిన ఓపెన్ జిమ్ పార్క్
- మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తేవాలి
- దళిత చైతన్య అధ్యక్షులు డాక్టర్ ఉక్కుల అశోక్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** చింతపల్లిగూడలోని ఓపెన్ జిమ్ పార్క్, అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా అధ్వానంగా మారిందని, ఉక్కుల అశోక్ తెలిపారు. శంషాబాద్ జోనల్, ఆదిబట్ల సర్కిల్, కొంగరకలాన్ డివిజన్ పరిధిలోని, చింతపల్లిగూడలోని ఓపెన్ జిమ్ పార్క్, అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిందని, దళిత చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఉక్కుల అశోక్, పార్కును సందర్శించి ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కుల అశోక్ మాట్లాడుతూ... డాక్టర్ ఉక్కుల అశోక్, గ్రామానికి సమీపంలో ఉన్న ఈ పార్క్ ప్రజలకు సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో పాటు, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మరమ్మతులు, నిర్వహణ పనులు చేయకపోవడంతో, పిచ్చి మొక్కలతో గడ్డిగాదాతో పార్క్ దయనీయ స్థితికి చేరిందని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పార్క్ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్క్ పరిస్థితిపై స్థానికులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోగు శేఖర్, నాయకులు శేరి రమేష్, ఉడుతల రవి గౌడ్, జోగు మహేందర్తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.




## ఆదిభట్ల సర్కిల్ కార్యాలయం రాగన్నగూడలో!

**పరిపాలన సౌకర్యార్థం సర్కిల్ కార్యాలయం మార్పు**
**డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రజల పరిపాలన సౌకర్యార్థం నిమిత్తం ఆదిభట్ల సర్కిల్ కార్యాలయం మార్పు చేయడం జరిగిందని, డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకుగ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆదిభట్ల సర్కిల్ 15, కార్యాలయాన్ని ఆదిభట్ల నుండి తుర్కయంజాల్ ప్రాంతంలోని రాగన్నగూడ వార్డు కార్యాలయానికి మార్పు చేయడం జరిగిందని, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్ల ప్రజలకు అందుబాటులో ఉండేలా రాగన్నగూడలో కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి విషయమై ప్రజలు అధికారులకు సహకరించాలని పేర్కొన్నారు. ప్రజల పాలన నిమిత్తం ప్రజల సౌకర్యార్థం సర్కిల్ కార్యాలయం మార్చడం జరిగిందని కమిషనర్ తెలిపారు..

## తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించేలా చూడాలి

**ప్లాస్టిక్ కు బదులుగా బయోడిగ్రేబుల్ సంచులను వాడాలి .. బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**





**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరం లోని అపార్ట్ మెంట్ ల నుండి తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించే లా చూడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులకు సూచించారు. శుక్రవారం వరంగల్ నగర పరిధి 33 వ డివిజన్ పెరికవాడ ప్రాంతం తడి పొడి చెత్త ను వేరు గా అందిస్తున్న విధానాన్ని కమిషనర్ ప్రత్యక్షం గా పరిశీలించి సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ద్వారకామయి అపార్ట్మెంట్ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నగరంలో అపార్ట్మెంట్ లలో తడి పొడి చెత్తను వేరుగా అందించడం పై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు సూచించిన కమిషనర్ ద్వారకామయి అపార్ట్మెంట్ ను పైలట్ ప్రాజెక్ట్ గా తీసుకొని తడి పొడి చెత్తను వేరుగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అపార్ట్మెంట్ లో సమూహాలుగా కుటుంబాలు నివాసం ఉంటాయని ఇక్కడినుండి చెత్త సేకరణ సులభం అవ్వడం తో పాటు బల్క్ గా లభిస్తుందని ప్రయోగాత్మకం గా ఇక్కడినుండే సేకరణ మొదలు పెట్టాలని, ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్యయం గా బయో డిగ్రేబుల్ సంచులు, కాగితపు సంచులు, బట్ట ,జ్యూట్ సంచులను వినియోగించాలని తెలిపారు. చెత్తను వేరుగా అందించడం కోసం అపార్ట్మెంట్ వాసులు ప్రత్యేకం గా 4 డ్రమ్ములను ఏర్పాటు చేసుకోవడం హర్షణీయం అని ఇదే విధానాన్ని ఇతర అపార్ట్మెంట్ వాసులు అనుసరించేలా శానిటేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఇదే ప్రాంతం లో డ్రైన్ లో సిల్ట్ తీసే విధానాన్ని పరిశీలించిన కమిషనర్ డ్రైన్ లో లోతు (డెప్త్) వరకు సిల్ట్ తీసేలా చూడాలని డ్రైన్ జంక్షన్ లలో ప్లాస్టిక్ సంచులు బాటిల్స్ పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ సుధాకర్, ఎం హెచ్ ఓ డా.రాజేష్ , సానిటరీ సూపర్వైజర్ గోల్కొండ శ్రీను, సానిటరీ ఇన్స్పెక్టర్ రాజు, కమ్యూనిటీ ఆర్గనైజర్ సుజాత వావ్, ప్రతినిధి పవన్, ఆర్ పి లు, తదితరులు పాల్గొన్నారు.

## సిటీ క్రైమ్ స్టేషన్ ను తనిఖీ చేసిన సీపీ

- పాత నేరస్థుల కదలికల పై నిఘా పెట్టండి
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ మహా;** గతంలో చోరీలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగలు అలాగే పాత నేరస్థుల పై ప్రత్యేక నిఘా పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సిసిఎస్ పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ వరంగల్ మట్టెవాడ లోని సిటీ క్రైమ్ స్టేషన్ ను శుక్రవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సిసిఎస్ పోలీస్ స్టేషన్ కు చేరుకున్న సిపికి అధికారులు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలించిన అనంతరం సీపీ పాత నేరస్తుల ఫోటోలను, స్టేషన్ రికార్డులను పరిశీలించి, చోరీల నివారణకు తీసుకుంటున్న చర్యలను సీపీ సంబంధిత స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా చోరీల నియంత్రణ కోసం చేపట్టాల్సిన ముందస్తు చర్యలను అధికారులకు సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ చోరీ కేసుల్లో జైలు కు వెళ్లి తిరిగి విడుదలయిన నిందితుల సమాచారం తప్పకుండా సేకరించాలని, ఇతర రాష్ట్రాల్లో చోరీ కేసుల్లో పట్టుబడిన నిందితుల వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని సీపీ తెలిపారు. ఈ తనిఖీల్లో క్రైమ్స్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, సిసిఎస్ ఇన్స్ స్పెక్టర్లు రాఘవేందర్, రామకృష్ణ, ఎస్సైలు ఉన్నారు.

## గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి సీఎం భరోసా

**సీఎం ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు, మేయర్**
**డివిజన్ల పెంపు, నగరాభివృద్ధి పై వినతి**



**హన్మకొండ మహా;** హైదరాబాద్ సెక్రటేరియట్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తో నగరాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారు చర్చించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలో ప్రస్తుతం ఉన్న 66 డివిజన్లను జనాభా, విస్తీర్ణం ఆధారంగా పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి వివరించారు. వరంగల్ నగరం రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, నగర విస్తరణకు అనుగుణంగా పాలనా సౌలభ్యం కోసం డివిజన్ల సంఖ్య పెంపు అవసరమని స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని కూడా అందజేశారు. ముఖ్యంగా కాజీపేట బస్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూ కేటాయింపు ప్రక్రియను రైల్వే శాఖ ద్వారా వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటికే కాజీపేట రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే అధికారులు సర్వే నిర్వహించారని, తదుపరి చర్యలు త్వరితగతిన చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. బస్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే కాజీపేట తో పాటు పరిసర ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయని ఎమ్మెల్యేలు తెలిపారు. భద్రకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధి అంశం, ఆలయ అభివృద్ధి పనులతో పాటు మాడ వీధుల నిర్మాణం జరుగుతున్న విషయాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యమంత్రి కి వివరించారు. భద్రకాళి అమ్మవారి దర్శనానికి వరంగల్ కు రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వరంగల్ నగర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.



## 5 లక్షల విలువగల నిషేధిత గుట్కా అంబర్ పట్టివేత

**ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్**

**హన్మకొండ మహా;** హనుమకొండ నగరం టైలర్ స్ట్రీట్ లోని బాలాజీ కిరాణా షాప్ నడుపుతున్న యజమాని పవన్ ఉపాధ్యాయ తన షాపు గోడౌన్ లో అక్రమంగా నిల్వ ఉంచిన 5 లక్షల విలువగల నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను హనుమకొండ పోలీసులు స్వాధీన పరచుకొని అతని పై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ పోలీస్ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. ఈ దాడిలో నిషేధిత పొగాకు ఉత్పత్తులను పట్టుకున్న ఎస్ఐ సతీష్,క్రైమ్ పార్టీ రావుఫ్, అశోక్ నులను ఇన్స్పెక్టర్ అభినందించారు.

## కశ్మీర్‌ను తలపించిన ఓరుగల్లు

**గ్రేటర్ వరంగల్ నగరాన్ని కప్పేసిన పొగ మంచు**

- ఉదయం వాహనదారులకు మంచుతో తప్పని తిప్పలు
- వీడని పొగ మంచు కానరాని సూర్య భగవానుడు



**వరంగల్ మహా ;** గ్రేటర్ వరంగల్ నగరంలో సూర్య భగవానుని పూర్తిగా పొగ మంచు కప్పేసింది. ఉదయం విద్యాలయాలకు పిల్లలను, విద్యార్థులను అలాగే ఉద్యోగస్తులు వ్యాపారస్తులు వెళ్లే సమయం కావడంతో వాహనదారులు చాలా దారి కనబడక ఇబ్బందులు పడ్డారు. గ్రేటర్ వరంగల్ నగరాన్ని దాదాపు ఉదయం 11 గంటల వరకు పొగ మంచు కమ్ముకుంది. చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాను శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో ఉదయం ఏడు గంటలకే తూర్పున కనిపించే సూర్యుడు 11 గంటలు దాటినా పొగ మంచు చాటునే ఉండిపోయాడు. ఎటూ చూసినా మంచు నగరం మొత్తం కశ్మీర్ ను తలపించింది. అందాల కశ్మీర్ ను తలపించిందంటూ ప్రకృతి ప్రేమికులు మురిసిపోయారు. పల్లె, పట్టణం అనే తేడాలేకుండా కనుచూపు మేర మంచు కమ్ముకొని ఉంది.

**వాహనదారుల ఇక్కట్లు**

ప్రధాన రహదారులు నగరంలోని రోడ్ల పై పొగమంచు తీవ్రత అధికంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగు మీటర్ల దూరం నుంచి వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొనడంతో ప్రయాణం నరకంగా మారింది. డ్రైవర్లు తప్పనిసరి పరిస్థితుల్లో తమ వాహనాల ఫ్లడ్ లైట్లు ఆన్ చేసి, అత్యంత నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. మరి కొందరు రోడ్డు పక్కనే వాహనాలను నిలిపివేసి గంటల తరబడి వేచి చూసి గమ్యస్థానాలకు చేరుకోవడానికి తీవ్ర జాప్యం ఎదురైంది.

**మంచు అందాలకు ప్రకృతి ప్రేమికుల పరవశం**

ఒక వైపు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ, ప్రకృతి ప్రేమికులు మాత్రం ఈ అద్భుతమైన నగరాన్ని కప్పేసిన మంచు అందాలను ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించారు. కనుచూపు మేర పరుచుకున్న మంచు దుప్పటి పట్టణాలు, గ్రామాలకు మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. గత కొన్నాళ్లుగా చలి తీవ్రత పెరగడంతో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పొగమంచు కారణంగా ఇలాంటి దృశ్యాలు తరచూ కనిపిస్తున్నాయి.



## పైడిపల్లి ఉర్సు ఉత్సవాలను సందర్శించిన కలెక్టర్

**వరంగల్ మహా ;** వరంగల్ నగరంలోని పైడిపల్లి ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భం గా కలెక్టర్ హజ్రారత్ నూరొద్దీన్ బాబా ను దర్శించుకొని దర్గా విశిష్టతను మత పెద్దలను అడిగి తెలుసుకొన్న అనంతరం చాదర్ సమర్పించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్ డి ఓ సుమ ఖిలా వరంగల్, వరంగల్ తహసిల్దార్ లు ఇక్బాల్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.




## బల్దియా కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్

**వరంగల్ మహా ;** ఆంగ్ల నూతన సంవత్సరం 2026 సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ (బల్దియా) చాహత్ బాజ్ పాయ్ ను 22 వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి వారి చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను, స్టేషనరిని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ లోని పలు అంశాల పై చర్చించారు.

## మున్సిపల్ ఓటర్ లిస్ట్ ను సరి చేయాలి

**45వ వార్డు నాయకుల వినతి**



**ఆదిలాబాద్ మహా:** మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్ పెట్టిన జిల్లా యంత్రాంగం ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని 49 వార్డులకు సంబంధించి ఓటర్ లిస్ట్ ను తయారు చేసింది. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో హెల్ప్ లైన్ సెంటర్ ను ఏర్పాటు చేసి ఓటరు లిస్ట్ ను పరిశీలించేందుకు అవకాశం కల్పించారు. ఓటరు జాబితా ఎన్నికల సంఘం నుండి వచ్చిన వివరాలతో తయారు చేసామని ఇందులో ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలని అధికారులు చెబుతున్నారు.ఈనెల 5వ తేదీ వరకు ఆయా అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితా సిద్ధం చేస్తామన్నారు.అయితే తొలి రోజు ఓటర్ లిస్టును పరిశీలించిన 45వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ ఓటర్ లిస్ట్ లో కొన్ని సవరణలు కోరారు. 45 వ వార్డులో ఇతర వార్డులోని కాలనీలు ఖుర్షిద్ నగర్,సుందరయ్యనగర్ ,గాంధీ నగర్, విద్యానగర్, ద్వారకా నగర్, పోలీస్ కాలనీ ,రిక్షా కాలనీ , బట్టి సావర్ గాం , తిర్పెల్లి కాలనీలకు చెందిన సుమారు 200 మంది ఓటర్ల పేర్లు తమ వార్డు లిస్ట్ లోకి వచ్చినట్టు తెలిపారు.అలాగే తమ వార్డులోని కొందరి ఓటర్ల పేర్లు ఇతర వార్డుల జాబితాలో నమోదయ్యాయన్నారు. దీనిని సరిచేయాలని ఆయన మున్సిపల్ కమీషనర్ కు వినతి పత్రం రూపంలో సూచించారు.ఇదే విషయాన్ని అడిషనల్ కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్ళినట్టు తెలిపారు.



## పది దాటిన వీడని పొగ మంచు

**రహదారులు కనిపించక అవస్థలు**

**వలిగొండ, మహా :** వలిగొండ మండలంలో శుక్రవారం ఉదయం పది దాటినప్పటికీ పొగ మంచు విడవకపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడవలసి వచ్చింది లైట్లు వేసుకొని వాహనాలు నడిపిన కానీ రహదారి కనిపించకపోవడంతో అనేకమంది వాహనదారులు రోడ్లు పైనే నిలిచిపోయారు గోపరాజు పల్లి లో వ్యవసాయ పనులకు వెళ్లే వారు పొగ మంచుతో చలితో వణుకుతూ ఇబ్బందులకు గురయ్యారు

## ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపారు కలెక్టర్ హనుమంత రావు తెలియజేశారు. శుక్రవారం ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం అయిన సందర్భంగా.... వివిధ శాఖలకు చెందిన అధికారులు, వారి సిబ్బంది కలెక్టర్ ని కలిసి పేద విద్యార్థులకు అవసరమగు బుక్స్, పెన్, దుప్పట్లు వంటి వస్తువులను కలెక్టర్ కి అందించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.... జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేందుకు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తోడ్పాటు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు,ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## మూసీ ప్రక్షాళన ఏమైంది ఆర్భాటం తప్ప ఆచరణలో ఏది?

**ఎండి జహంగీర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు**




**వలిగొండ, మహా:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్భాటంగా ప్రకటించిన మూసీ ప్రక్షాళన ఏమైందో సమాధానం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్ డిమాండ్ చేశారు శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో కూర శ్రీనివాస్ అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జహంగీర్ మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన చేసి జిల్లాలో 8 మండలాల్లో 10 లక్షల ఎకరాలతో పాటు ఈ ప్రాంత ప్రజలకు విషపు నీటి నుండి విముక్తి కల్పిస్తామని ముఖ్యమంత్రి గొప్ప మాటలు చెప్పిన అవి ఆర్భాటానికి తప్ప ఆచరణకు నోచుకోకపోవడం లేదని ఆయన అన్నారు భువనగిరి శాసనసభ్యులు కుటుంబం అనిల్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో బస్వాపురం ప్రాజెక్టు కోసం ప్రస్తావిస్తూ 100 కోట్లు కేటాయించాలని కోరినప్పటికీ ముంపు గ్రామాల ప్రజలకు నష్టపరిహారం చెల్లించడానికి 210 కోట్లు కేటాయించాల్సి ఉందని 100 కోట్లతో ఏ రకంగా పరిహారాన్ని అందిస్తారన్నారు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిపిఎం భవిష్యత్తు కార్యాచరణ ను ప్రకటిస్తుందని ప్రజాభవన్ ముట్టడిని నిర్వహిస్తామని హెచ్చరించారు అదేవిధంగా సహకార సంఘాల కు ఎన్నికలను నిర్వహించాలని నామినేటెడ్ చేసుకొని తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే రైతుల నుండి తీవ్రమైన వ్యతిరేకత వస్తుందనరు ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి,మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, మండల కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు, మొగిలిపాక గోపాల్, దుబ్బ లింగం, కవిడే సురేష్, బూడిద మనమ్మ తదితరులు పాల్గొన్నారు

## గురునానక్ విద్యార్థి ఆత్మహత్య... కళాశాల యాజమాన్యమే కారణమా..?

- ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణం
- యాజమాన్యం వేధింపులతో విద్యార్థి రాము ఆత్మహత్య..?
- ఎస్ఎఫ్ఐ ఏబీవీపీ విద్యార్థి సంఘాల ఆందోళనలు
- కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి..






కళాశాల యాజమాన్యం వేధింపుల కారణంగా.?...

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి గురునాకేక్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి కాలేజ్ హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఆముదాల రాము (20) కరీంనగర్ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో, కళాశాల యాజమాన్యం వేధింపుల వలన విద్యార్థి మృతి చెందాడని, తరంగ్ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు, శివ ఎబివిపి నాయకులు, ముత్యాల మహేందర్ బీజేపీ నేతల ఆధ్వర్యంలో, కళాశాల ముందు ధర్నా చేశారు.. విద్యార్థులు ఆందోళన చేపట్టి కళాశాలలోని భవనాల అద్దాలు ధ్వంసం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది.. ఇబ్రహీంపట్నం సిఐ మహేందర్ రెడ్డి కళాశాల వద్దకు చేరుకొని, ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నేతలను అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు..

**విద్యార్థులను పట్టించుకోని కళాశాల యాజమాన్యం....**

గతంలో కూడా విద్యార్థులు కళాశాల యాజమాన్యం వేధింపుల కారణంగానే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని విద్యార్థి సంఘం నేతలు ఆరోపించారు.. డబ్బులు దండుకోవడమే ధ్యేయంగా గురునానక్ కళాశాల ఉంది తప్ప విద్యార్థులకు సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని ఆరోపణలు.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న గురునానక్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని, లేని యెడల అన్ని సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

## ముంబైలో దారుణం

**పెళ్లికి నిరాకరించిన ప్రియుడిపై మహిళ దాడి**

- న్యూ ఇయర్ స్వీట్స్ ఇస్తానంటూ పిలిచి..ప్రియుడిపై వివాహిత ఘాతుకం
- కత్తితో మర్మాంగంపై దాడి చేయడంతో తీవ్ర గాయాలు
- నిందితురాలి పరారీ.. కేసు నమోదు




**ముంబై, మహా :** ముంబైలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. తనను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడన్న కోపంతో ఓ వివాహిత తన ప్రియుడి మర్మాంగంపై కత్తితో దాడి చేసింది. న్యూ ఇయర్ స్వీట్స్ ఇస్తానని నమ్మించి ఇంటికి పిలిచి ఈ ఘాతుకానికి పాల్పడింది. బాధితుడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా,నిందితురాలు పరారీలో ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 25 ఏళ్ల మహిళకు, 44 ఏళ్ల వ్యక్తికి గత ఆరేడు సంవత్సరాలుగా వివాహేతర సంబంధం ఉంది. వీరిద్దరూ బంధువులు కూడా. అయితే, భార్యను వదిలేసి తనను పెళ్లి చేసుకోవాలని నిందితురాలు కొన్నాళ్లుగా ప్రియుడిపై తీవ్ర ఒత్తిడి తెస్తోంది. ఈ విషయమై వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఆమె ఒత్తిడి భరించలేక బాధితుడు 2025 నవంబర్ లో బిహార్‌లోని తన స్వగ్రామానికి వెళ్లాడు. అక్కడికి కూడా ఆమె ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడింది. డిసెంబర్ 19న ముంబైకి తిరిగి వచ్చిన బాధితుడు, ఆమెతో సంబంధాలు తెంచుకుని దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో డిసెంబర్ 31 అర్ధ రాత్రి 1:30 గంటల సమయంలో న్యూ ఇయర్ స్వీట్స్ తీసుకోవడానికి ఇంటికి రావాలని ఆమె అతడిని ఆహ్వానించింది. ఇంట్లోకి వెళ్లాక, అతడిని ప్యాంటు విప్పమని చెప్పి, వంటగది నుంచి కూరగాయలు కోసే కత్తితో వచ్చి మర్మాంగంపై దాడి చేసింది. తీవ్ర రక్తస్రావంతో గాయపడిన బాధితుడు, అక్కడి నుంచి తప్పించుకుని తన ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని మొదట వీఎన్ దేశాయ్ ఆసుపత్రికి, ఆ తర్వాత సియోన్ ఆసుపత్రికి తరలించారు. గాయం చాలా లోతుగా ఉందని, శస్త్రచికిత్స అవసరం కావచ్చని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పరారీలో ఉన్న నిందితురాలి కోసం గాలిస్తున్నారు.

## దుర్గం చెరువు కబ్జా ఆరోపణలు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై కేసు నమోదు
- దుర్గం చెరువులో 5 ఎకరాల స్థలం ఆక్రమించారని ఆరోపణలు
- హైడ్రా ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు

**హైదరాబాద్, మహా :** దుర్గం చెరువు ఆక్రమణల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. చెరువు స్థలాన్ని ఆక్రమించారన్న ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యేతో పాటు వెంకట్ రెడ్డి అనే వ్యక్తిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. హైడ్రా అధికారుల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గం చెరువు పరిధిలో దాదాపు ఐదు ఎకరాల స్థలాన్ని కబ్జా చేసినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. చెరువు ప్రాంతాన్ని మట్టి, రాళ్లతో నింపి చదును చేశారని, అనంతరం ఆ స్థలాన్ని ఎస్‌టీఎస్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వారికి పార్కింగ్ కోసం అద్దెకు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయి. ఇలా అక్రమంగా ఆక్రమించిన ప్రభుత్వ భూమి ద్వారా నిందితులు అక్రమ ఆదాయం పొందుతున్నారని హైడ్రా తన ఫిర్యాదులో పేర్కొంది. వాస్తవానికి 2014లోనే హెచ్ఎండీఏ దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, నోటిఫికేషన్ ఉన్నప్పటికీ నిబంధనలను ఉల్లంఘించి ఆక్రమణలు జరిగాయని అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణలపై హైడ్రా సూపర్ వైజర్ క్రాంతి ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు స్పందించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డిలపై బీఎన్ఎస్ చట్టం లోని 329(3), 3(5) సెక్షన్లతో పాటు పీడీపీపీ యాక్ట్ సెక్షన్ 3 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రిఫ్రిజిరేటర్లు, ఏసీల ధరలకు రెక్కలు!

## 10 శాతం వరకు పెరిగే అవకాశం.. జనవరి 1 నుంచి కొత్త స్టార్.. రేటింగ్ నిబంధనలు



**న్యూఢిల్లీ:** కూలింగ్ ఉత్పత్తులైన ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు 510 శాతం మధ్య పెరగనున్నాయి. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బీఈఈ) సవరించిన స్టార్ రేటింగ్ నిబంధనలు అమల్లోకి రానుండడంతో ఈ పరిణామం చోటుచేసుకోనుంది. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో సెప్టెంబర్ 22 నుంచి ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు 10 శాతం వరకు తగ్గగా.. ఇప్పుడు స్టార్ రేటింగ్ ప్రమాణాల కారణంగా ఆ ప్రయోజనం మొత్తం కనుమరుగు కానుంది. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ క్షీణించడం, కాపర్ ధరలు పెరిగిన కారణంగా ఏసీలు, రిఫ్రిజిరేటర్ల తయారీ సంస్థలు వ్యయ భారాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో ధరలు పెంచక తప్పని పరిస్థితి ఏర్పడినట్టు చెబుతున్నాయి. అయితే ఈ చర్య కర్బన ఉద్గారాల తగ్గింపునకు మేలు చేస్తుందని వోల్టాస్, డైకిన్, బ్లూస్టార్, గోద్రేజ్ అప్లయెన్సెస్ పేర్కొన్నాయి.

**కరెంటు ఆదా..**

సవరించిన బీఈఈ నిబంధనల కింద.. కొత్త 5 స్టార్ రేటింగ్ ఏసీలు 10 శాతం మరింద ఇంధనాన్ని ఆదా చేయనున్నాయని, అదే సమయంలో ఉత్పత్తుల ధరలు 10 శాతం పెరగనున్నాయని బ్లూస్టార్ ఎండీ బి.త్యాగరాజన్ తెలిపారు. కొత్త 5 స్టార్ అన్నది ప్రస్తుత ఉత్పత్తుల కోణంలో నుంచి చూస్తే 67 స్టార్ ఇంధన సామర్థ్యానికి సమానంగా ఉంటుందన్నారు. ఇప్పుడున్న 5 స్టార్ ఏసీ, రిఫ్రిజిటేటర్ జనవరి 1 తర్వాత 4 స్టార్‌కు తగ్గిపోనున్నాయి. ఇలా ప్రస్తుత ప్రమాణాల ప్రకారం తయారైన ప్రతీ ఉత్పత్తికి సంబంధించి స్టార్ రేటింగ్ ఒక మెట్టు కిందకు వెళ్లిపోనుంది. ఇంధన రేటింగ్ మార్పు కారణంగా ఏసీల ధరలు 57 శాతం మేర, రిఫ్రిజిరేటర్ల ధరలు 35 శాతం మేర పెరుగుతాయని గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ బిజినెస్ హెడ్ కమల్ నంది తెలిపారు. కరెన్సీ విలువ క్షీణత, కమోడిటీ ధరల పెరుగుదలతో వ్యయాల భారాన్ని కంపెనీలు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. కొత్త ఇంధన ప్రమాణాలు అమల్లోకి రానుండడంతో డిమాండ్ ఊపందుకుంటుందని వోల్టాస్ సీనియర్ బిజినెస్ లీడర్ జయంత్ బలాన్ అంచనా వేశారు. ధరల పెరుగుదలకు ముందుగానే డీలర్లు, వినియోగదారులు ఆర్డర్లు పెట్టేందుకు ఆసక్తి చూపించొచ్చన్నారు.

**ఇతర ఉత్పత్తులకూ కొత్త ప్రమాణాలు**

ఏసీలు, రిఫ్రిజిరేట్లతోపాటు.. టెలివిజన్లు, ఎల్‌పీజీ గ్యాస్ స్టవ్‌లు, కూలింగ్ టవర్లు, చిల్లర్లకు సైతం కొత్త బీఈఈ స్టార్ రేటింగ్ ప్రమాణాలు జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.



# ఒక్క కంపెనీ.. 22.55 లక్షల కార్లు!

మారుతి సుజుకి కార్లకు దేశీయ మార్కెట్లో మాత్రమే కాకుండా.. అంతర్జాతీయ మార్కెట్లో కూడా మంచి ఆదరణ ఉంది. దీంతో అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కంపెనీ 2025లో ఏకంగా 22.55 లక్షలకు వాహనాలను ఉత్పత్తి చేసింది. దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ సంస్థ అయిన మారుతి సుజుకి.. 2021లో 16.29 లక్షల యూనిట్లను, 2022లో 19.16 లక్షల యూనిట్లను, 2023లో 19.34 లక్షల యూనిట్లను, 2024లో 20.63 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేసింది. ఇప్పుడు కంపెనీ గత ఏడాది 22.55 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేసినట్లు వెల్లడించింది. దీంతో మారుతి సుజుకి ఉత్పత్తి 20 లక్షల యూనిట్ల మార్కును దాటడం ఇది వరుసగా రెండవ సంవత్సరం. గత ఏడాది కంపెనీ ఉత్పత్తి చేసిన కార్లను.. మన దేశంలో విక్రయించడానికి మాత్రమే కాకుండా. ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేసింది. ఇందులో ఫ్రాంక్స్, బాలెనో, స్విఫ్ట్, డిజైర్, ఎర్టిగా మొదలైన మోడల్స్ ఉన్నాయి. కాగా మారుతి సుజుకి ప్రస్తుతం హర్యానాలోని గురుగ్రామ్, మనేసర్, ఖార్ఖోడాలలో తయారీ సౌకర్యాలను నిర్వహిస్తోంది. భారత ప్రభుత్వ 'మేక్ ఇన్ ఇండియా' చొరవకు అనుగుణంగా పెరుగుతున్న దేశీయ డిమాండ్‌ను తీర్చడానికి, ఎగుమతి చేయడానికి కంపెనీ దేశంలోనే తన ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తోంది. అంతే కాకుండా మారుతి సుజుకి తన తయారీ సామర్థ్యాన్ని సంవత్సరానికి 40 లక్షల యూనిట్లకు విస్తరించాలని యోచిస్తోంది. ఇదే జరిగితే కార్ల ఉత్పత్తి మరింత పెరుగుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఆనంద్ మహీంద్రా న్యూ ఇయర్ సందేశం



కృత్రిమ మేథ (ఏఐ)తో ఫ్యాక్టరీ టెక్నీషియన్లు, మెషినిస్టుల్లాంటి బ్లూకాలర్ ఉద్యోగులకు ముప్పేమీ ఉండదని, ప్రాక్టికల్ నైపుణ్యాలను వినియోగించి వారు మరింత ఆదాయం ఆర్జించేందుకు తోడ్పడే యాక్సిలరేటరుగా ఇది ఉపయోగపడుతుందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా వెల్లడించారు. ఇంటెలిజెంట్ సిస్టమ్‌లు రొటీన్ పనులను నిర్వహించడం వల్ల ప్రాక్టికల్ నైపుణ్యాలకు మరింత ప్రాధాన్యం పెరుగుతుందని, ఉద్యోగులకు పంపిన నూతన సంవత్సర సందేశంలో ఆయన పేర్కొన్నారు. ఏఐ గురించి ఆందోళన చెందకుండా టెక్నీషియన్లు దానితో ధీమాగా కలిసి పని చేసే విధంగా మార్పులు వస్తాయని వివరించారు. దీన్ని తాము ఆచరణలో అమలు చేసి చూపిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఏఐ పరమైన పరిణామాలతో బ్లూకాలర్ ఉద్యోగాలు కాస్తా ఆకర్షణీయమైన గోల్డ్ కాలర్ ఉద్యోగాలుగా మారతాయని తెలిపారు. మారుతున్న టెక్నాలజీ, భౌగోళిక రాజకీయపరమైన పరిణామాలతో నూతన సంవత్సరంలో సర్వత్రా అనిశ్చితి నెలకొనవచ్చని మహీంద్రా చెప్పారు. అయితే అనిశ్చితిని శత్రువుగా పరిగణించకుండా, మన సత్తా నిరూపించుకునే అవకాశంగా భావించాలని సూచించారు. 2025లో ఎస్‌యూవీలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రిక్ త్రీవీలర్లు, మహీంద్రా ఫైనాన్స్ తదితర వ్యాపార విభాగాల్లో గ్రూప్ గణనీయ విజయాలు సాధించిందని ఆనంద్ మహీంద్రా చెప్పారు.




# 10 నిమిషాల్లో డెలివరీ..

## స్పందించిన జొమాటో సీఈఓ

జీతం, పని పరిస్థితులు, సామాజిక భద్రత లేకపోవడాన్ని నిరసిస్తూ డిసెంబర్ 31న గిగ్ వర్కర్లు సమ్మె నిర్వహించారు. ఆ తరువాత ప్రోత్సాహాలు అందిస్తున్నట్లు ప్రకటనలు వచ్చాయి. ఇప్పుడు 10 నిమిషాల డెలివరీపై జొమాటో సీఈఓ.. దీపిందర్ గోయల్ స్పందించారు. దీనికి సంబంధించిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 10 నిమిషాల డెలివరీ సర్వీస్.. డెలివరీ ఏజెంట్స్ లేదా రైడర్లపై ఒత్తిడి తెస్తుందని విమర్శలు వెల్లువెత్తుతున్న సమయంలో, దీపిందర్ గోయల్ స్పందిస్తూ..ఇళ్ల చుట్టుపక్కల్లో దుకాణాలు ఎక్కువ కావడం వల్లనే 10 నిమిషాల డెలివరీ అనేది తీసుకొచ్చాము. దీని ఉద్దేశ్యం డెలివరీ ఏజెంట్ వేగంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాలని కాదని అన్నారు. అంతే కాకుండా డెలివరీ కోసం కస్టమర్లకు ఇచ్చిన టైమర్.. డెలివరీ ఏజెంట్లకు కనిపించదని వెల్లడించారు. బ్లింకిట్‌లో ఆర్డర్ వచ్చిన తరువాత.. దానిని 2.5 నిమిషాల్లో ప్యాక్ చేస్తారు. ఆ తరువాత రైడర్ 8 నిమిషాలకు 2 కిలోమీటర్ల చొప్పున రైడ్ చేసినా.. గంటకు సగటున 15 కిలోమీటర్ల వేగంతో వెళ్లగలడు. ఈ విధానం అర్థం చేసుకోకపోవడం వల్లనే.. దీనిని రిస్క్ అని భావిస్తున్నారు. కాబట్టి దీనిని గిగ్ వర్కర్లు తప్పకుండా అర్థం చేసుకోవాలి. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని పూర్తిగా నమ్మవద్దని గోయల్ పేర్కొన్నారు. ఇక కార్మికుల భద్రత గురించి వివరిస్తూ.. డెలివరీ భాగస్వాములకు వైద్య, జీవిత బీమా ఉందని గోయల్ అన్నారు. ఆలస్యానికి జరిమానాల విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ.. డెలివరీ ఏజెంట్స్.. సమయానికి అందించకపోతే ఏమీ జరగదు. కొన్నిసార్లు అనుకోకుండా ఆలస్యాలు జరుగుతాయని గోయల్ వెల్లడించారు



# దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL



# కండోమ్, గర్భ నిరోధక మాత్రలపై అమల్లోకి వచ్చిన వ్యాట్

ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశానికి సరికొత్త సమస్య వచ్చి పడింది. జననాల రేటు దారుణంగా పడిపోతుండడంతో రాబోయే రోజుల్లో దానిని అక్కడి ప్రభుత్వం నానాపాట్లు పడుతోంది. ఈ క్రమంలో కొత్త ఏడాది.. అందునా మొదటి రోజే ఓ కీలక నిర్ణయం ప్రకటించింది. కండోమ్ సహా గర్భ నిరోధక మాత్రలు, ఇతర సంబంధిత ఔషధాలపై 13 శాతం పన్ను విధించి.. తీవ్ర చర్చకు దారి తీసింది. చైనా ప్రభుత్వంలో ఈ తరహా నిర్ణయాలు తీసుకోవడానికి కారణాలు ఉన్నాయి. అక్కడ గత మూడేళ్లుగా జననాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 2024లో కేవలం కోటి మంది పిల్లలు మాత్రమే పుట్టారు. ఇది గత దశాబ్దం కాలంనాటి గణాంకాల్లో సగం కావడం గమనార్హం. వృద్ధ జనాభా, ఆర్థిక మందగమనం కారణంగా ప్రభుత్వం త్వరగా పెళ్లి చేసుకుని ఎక్కువ పిల్లలు కనాలని అక్కడి యువతను కోరుకుంటోంది. ఈ క్రమంలో.. గర్భనిరోధక వస్తువులు (కండోమ్‌లు, మాత్రలు, IUDలు)లపై పన్నులు పెంచగా, చైల్డ్‌కేర్ సేవలు (పిల్లల సంరక్షణ), వివాహ సంబంధిత సేవలు, వృద్ధుల సంరక్షణ సేవల వస్తువులపై పన్నులు తగ్గించింది. తల్లిదండ్రులకు ఎక్కువ పేరెంటల్ లీవ్.. క్యాష్ హ్యాండౌట్లు (ఆర్థిక సహాయం) వంటి ప్రోత్సహాకాలు అందిస్తోంది. 2026 జనవరి 1 నుండి కండోమ్‌లు, గర్భనిరోధక మాత్రలు, IUDలు వంటి వస్తువులపై 13 శాతం వ్యాట్ అమల్లోకి తెచ్చింది. 1993 నుంచి ఈ వస్తువులు వ్యాట్ కేటగిరీ నుంచి మినహాయింపు పొందుతూ వచ్చాయి. కానీ..

**నిపుణులు ఏం చెబుతున్నారంటే..**

కండోమ్‌ల ధర పెరగడం వల్ల జననాల సంఖ్య పెరగడం అసాధ్యమని నిపుణులు అభిప్రాయవ్యక్తం చేస్తున్నారు. అసలు సమస్య పిల్లల పెంపకం ఖర్చులు ఎక్కువగా ఉండటమేనని చెబుతున్నారు. చైనాలో కండోమ్‌లపై పన్నులు పెరగడం వల్ల వాటి ధరలు పెరిగితే, ప్రజలు వాటిని తక్కువగా ఉపయోగించే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతుండగా.. ఇది హెచ్ఐవీ వ్యాప్తి ప్రమాదాన్ని పెంచుతుందని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరిస్తోంది. గతంలో కొన్ని దేశాల్లో ఎదురైన పరిస్థితులనూ ఈ సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రస్తావిస్తోంది. అదే సమయంలో చైనాలో హెచ్ఐవీ కేసులు.. గత దశాబ్దంలో తగ్గినా, యువతలో కొత్త కేసులు ఇంకా నమోదవుతున్నాయనే విషయాన్ని గుర్తు చేస్తోంది.

**ట్రోలింగ్..**

జననాల రేటు పెంచేందుకు చైనా ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. యువత ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం పెళ్లి చేసుకుని పిల్లలు కనమని చెబుతోంది. మరోవైపు గర్భనిరోధక వస్తువులను ఖరీదుగా చేస్తోందంటూ మండిపడుతున్నారు. మరోవైపు.. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ నడుస్తోంది. కండోమ్స్ ధరలు పెంచడం అంటే.. ముందుగానే రెండు,మూడేళ్లకు ముందే కండోమ్స్ కొనుగోలు చేయమని చెబుతున్నారా? అంటూ చైనా యువత సెటైర్లు సంధిస్తున్నారు. కండోమ్ ధరలు పెంచటం ద్వారా పిల్లల సంఖ్య పెరుగుతుందనే ఆలోచన రావటమే సూపర్.. మనం పిల్లల్ని కనటానికి మన కంటే ప్రభుత్వమే చాలా ఎక్కువగా కష్టపడుతుందంటూ నెటిజన్లు పంచ్‌ల మీద పంచ్‌లు వేస్తున్నారు.



# కలిసి జీవిస్తేనే 'గ్రీన్‌కార్డు'




**వాషింగ్టన్:** అమెరికాలో శాశ్వత నివాసానికి, తద్వారా పౌరసత్వం పొందడానికి దగ్గరి దారి అమెరికా పౌరసత్వం ఉన్న వారిని పెళ్లాడటం. గ్రీన్‌కార్డు అని పిలిచే శాశ్వత నివాస కార్డు(పర్మినెంట్ రెసిడెంట్ కార్డు) కోసం విదేశీయులు ముఖ్యంగా భారతీయులు అమెరికా పౌరుడు/పౌరురాలిని వివాహం చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తుంటారు. అమెరికాలో నివసిస్తున్న వలసదారుల అంతిమ లక్ష్యం గ్రీన్‌కార్డు సాధించడమే. అయితే, గ్రీన్‌కార్డు కలిగినవారు అమెరికా గడ్డపై జన్మించిన పౌరులతో సమానం కాదు. అయినప్పటికీ పౌరులతో సమానంగా చాలావరకు హక్కులు లభిస్తాయి. తర్వాత అమెరికా పౌరసత్వం పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ కార్డుకు డిమాండ్ పెరగడానికి ఇదే అసలైన కారణం. అమెరికా పౌరసత్వం కలిగినవారిని పెళ్లి చేసుకుని గ్రీన్‌కార్డు కొట్టేద్దామంటే ఇకపై కుదరదని అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అటార్నీ బ్రాడ్ బెర్న్‌స్టీన్ తేల్చిచెప్పారు. ఇలాంటి పెళ్లితో గ్రీన్‌కార్డు రావడానికి గ్యారంటీ ఉండదని వెల్లడించారు. యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం అమెరికా సిటిజెన్‌ను వివాహం చేసుకొని జీవిత భాగస్వామిగా మారిన విదేశీ వ్యక్తిని "అమెరికా సిటిజెన్ తక్షణ బంధువు'గా పరిగణిస్తారు. అమెరికా పౌరుడు/పౌరురాలి భార్య/భర్తకు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే అర్హత చట్ట ప్రకారం లభిస్తుంది. అమెరికా సిటిజెన్‌ను వివాహం చేసుకుంటే గ్రీన్‌కార్డు వచ్చేసినట్లేనని భావించవద్దని, ఆ అవకాశం ఉండదని బెర్న్‌స్టీన్ తెలియజేశారు. గ్రీన్‌కార్డు పొందాలంటే అమెరికా సిటిజెన్‌తో పెళ్లి ఒక్కటే సరిపోదని చెప్పారు. వివాహం చేసుకున్న స్త్రీ పురుషులు చాలా ఏళ్లుగా కలిసి జీవిస్తున్నట్లుగా నిర్ధారణ అయితేనే ఈ కార్డు పొందే వీలుంటుందని పేర్కొన్నారు. ఇమ్మిగ్రేషన్ చట్టాలపై బెర్న్‌స్టీన్‌కు 30 ఏళ్లకుపైగా అనుభవం ఉంది. దంపతులు వేర్వేరుగా జీవిస్తున్నట్లు తెలిస్తే గ్రీన్‌కార్డు దరఖాస్తును ప్రభుత్వం పక్కనపడేసే ప్రమాదం అధికంగా ఉందని ఆయన చెప్పారు. ఒకే ఇంట్లో కలిసికట్టుగా ఉంటేనే అవకాశాలు మెరుగు పడతాయని ఆయన సూచించారు. ఉద్యోగం, పిల్లల చదువులు వంటి కారణాలతో వేర్వేరుగా ఉంటున్నామని దంపతులు చెప్పినా అధికారులు వినిపించుకునే పరిస్థితి ఉండదని బెర్న్‌స్టీన్ స్పష్టంచేశారు. కలిసి ఉంటున్నట్లు వారికి విశ్వాసం కలిగించాలని పేర్కొన్నారు. దంపతులు నిత్యం ఒకే ఇంటిని పంచుకోవడం అనేది వివాహనికి నమ్మకమైన గుర్తింపుగా ఇమ్మిగ్రేషన్ చట్టాలు భావిస్తాయని తెలిపారు. పెళ్లి చేసుకుని దూరంగా ఉంటూ గ్రీన్‌కార్డు కోసం ప్రయత్నించేవారు తొలుత న్యాయ సహాయం తీసుకోవాలని స్పష్టంచేశారు. అమెరికా వీసాలు, గ్రీన్‌కార్డుల కోసమే అమెరికా సిటిజెన్‌ను పెళ్లి చేసుకున్నట్లు తేలితే కఠిన శిక్షలుంటాయని హెచ్చరించారు.

## ఆఫ్ఘనిస్తాన్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు..

# 17 మంది మృతి



ఆఫ్ఘనిస్తాన్‌ను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వరదలు కారణంగా 17 మంది మృతిచెందారని, 11 మంది గాయపడినట్లు ఆఫ్ఘానిస్తాన్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. హెరాత్ ప్రావిన్స్‌లోని కబ్కాన్ జిల్లాలో గురువారం ఒక ఇంటి పైకప్పు కూలిపోవడంతో ఐదుగురు కుటుంబ సభ్యులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం(డిసెంబర్ 29, 2025) నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాలు అతలాకుతలమవుతున్నాయి. మధ్య, ఉత్తర, దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో నష్టం అధికంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. వరదలు కారణంగా పశువులు కూడా చనిపోయాయి. వరద ప్రభావం 1,800 కుటుంబాలపై పడిందన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని.. వరద తీవ్రతను అంచనా వేయడానికి బృందాలను పంపించినట్లు ప్రభుత్వం తెలిపింది. దేశవ్యాప్తంగా చాలా కాలంగా వర్షాలు లేక కరువు పరిస్థితులు ఎదుర్కొంటుంది. భారీ వర్షాలు కురిసిప్పటికీ ఆకస్మిక వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు పరిస్థితి మరింత దారుణంగా మారింది.

# బలగాల ప్రయోగంపై కేపీ ఓలీకి సమన్లు!



**కాఠ్మండు:** గత ఏడాది సెప్టెంబర్‌లో నేపాల్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంలో యువత పైకి సాయుధబలగాలను ప్రయోగించి నాటి ప్రధాని కేపీ శర్మ ఓలీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై విచారణ కమిషన్ త్వరలో ఆయనను విచారించనుంది. జనవరి 21వ తేదీలోగా నివేదిక సమర్పించాల్సి ఉండటంతో ఆలోపు నిర్ణయాత్మకమైన నేతలు, అధికారుల నుంచి కమిషన్ సభ్యులు వివరణ తీసుకోనున్నారు. సెప్టెంబర్ 8వ తేదీన కాఠ్మండులో ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీ చేపట్టిన యువతపై పోలీసులు జరిపిన కాల్పుల్లో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. నేపాల్‌లో అవినీతి, వారసత్వ రాజకీయాలు, అస్తవ్యస్త పాలనతో విసిగిపోయిన జనం జెన్-జెడ్ యువతరం సారథ్యంలో ఉద్యమించడంతో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో దేశవ్యాప్తంగా ఆనాడు 77 మంది చనిపోయిన విషయం తెల్సిందే. దీంతో నేపాల్ తాత్కాలిక ప్రభుత్వం నియమించిన గౌరీ బహదూర్ కర్కీ సారథ్యంలోని విచారణ కమిషన్ దర్యాప్తు మొదలెట్టింది. కర్కీ గురువారం మీడియాతో మాట్లాడారు. ఘటనలో స్పష్టత కోసం ఓలీకి సమన్లు జారీచేసి ప్రశ్నించే అవకాశముందని చెప్పారు. అయితే కమిషన్ ఎదుట తాను హాజరయ్యే ప్రసక్తే లేదని కేపీ శర్మ ఓలీ కరాఖండీగా చెప్పేశారు. కమిషన్ చట్టబద్ధతను, విచారణలో పారదర్శకతను ఆయన ప్రశ్నించారు.

# మెగాస్టార్ సంక్రాంతి సినిమా..
# ఫ్యాన్స్‌కు బిగ్ అప్‌డేట్



మెగాస్టార్ హీరోగా వస్తోన్న లేటేస్ట్ ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్ మనశంకర వరప్రసాద్ గారు. తొలిసారి అనిల్ రావిపూడి- చిరు కాంబోలో వస్తోన్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ఏడాది సంక్రాంతి పోటీలో నిలిచిన ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్‌తో సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రిలీజ్‌కు కొద్ది రోజుల సమయం మాత్రమే ఉండడంతో మేకర్స్ ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీ అయిపోయారు. ఈ నేపథ్యంలోనే ఈ మూవీకి సంబంధించిన బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. మనశంకర వరప్రసాద్ గారు మూవీ ట్రైలర్ రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈనెల 4న విడుదల చేస్తామని నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ అఫీషియల్‌గా వెల్లడించింది. ఈ విషయాన్ని ట్విటర్ ద్వారా తెలియజేస్తూ పోస్టర్‌ను పంచుకుంది. దీంతో మెగా ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. కాగా.. గతేడాది సంక్రాంతికి వస్తున్నాం మూవీతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టిన అనిల్ రావిపూడి.. మరో హిట్ కోసం రెడీ అయిపోయారు. ఈ చిత్రంలో వెంకీమామ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన మీసాల పిల్ల సాంగ్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సంక్రాంతికి వస్తోన్న మనశంకర వరప్రసాద్‌లో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటించింది.



# ఓటీటీలోకి వచ్చిన వార్ బ్యాక్‌డ్రాప్ మూవీ

ఈ వీకెండ్ థియేటర్లలో సైక్ సిద్ధార్థ్, వనవీర, 45 తదితర తెలుగు స్ట్రెయిట్, డబ్బింగ్ సినిమాలు రిలీజయ్యాయి. కానీ వీటిలో ఏది కూడా పాజిటివ్ టాక్ తెచ్చుకోలేకపోయాయి. క్రిస్మస్‌కి వచ్చిన చిత్రాల్నే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మరోవైపు న్యూఇయర్ సందర్భంగా చాలా కొత్త మూవీస్ స్ట్రీమింగ్‌లోకి వచ్చాయి. లిస్టు చాలా పెద్దగానే ఉంది. ఇప్పుడు దానిలోకి మరో వార్ బ్యాక్ డ్రాప్ మూవీ కూడా చేరింది. బాలీవుడ్ స్టార్ ఫర్హాన్ అక్తర్.. చాన్నాళ్ల తర్వాత హీరోగా చేసిన సినిమా '120 బహదూర్'. 1962లో భారత్-చైనా మధ్య జరిగిన రెజాంగ్ లా యుద్ధ సంఘటనల ఆధారంగా దీన్ని తెరకెక్కించారు. నవంబరు 21న థియేటర్లలో రిలీజైంది. డీసెంట్ టాక్ తెచ్చుకుంది. ఇందులో రాశీఖన్నా హీరోయిన్‌గా చేసింది. ఇప్పుడీ మూవీ ఎలాంటి ప్రకటన లేకుండా అమెజాన్ ప్రైమ్ ఓటీటీలోకి వచ్చేసింది. ప్రస్తుతానికి అద్దె విధానంలో స్ట్రీమింగ్ అవుతోంది. మరో రెండు వారాల్లో ఉచితంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. '120 బహదూర్' విషయానికొస్తే.. మేజర్ షైతాన్ సింగ్ భాటి(ఫర్హాన్ అక్తర్).. తన 120 మంది సైనికులతో ఇండియా-చైనా బోర్డర్‌లో ఎలాంటి యుద్ధం చేశాడు. మూడు వేల మంది చైనా సైనికుల్ని ఎలా నిలువరించాడు? చివరకు ఏమైందనేదే స్టోరీ. యుద్ధ తరహా సినిమాలంటే ఇష్టముండే వాళ్లకు ఇది నచ్చేస్తుంది. మిగతా వాళ్లకు రొటీన్‌గానే అనిపించొచ్చు. స్టోరీ తెలిసిందే అయినప్పటికీ.. విజువల్స్, యాక్టింగ్ పరంగా ప్రశంసలు దక్కాయి.



# పదేళ్ల తర్వాత స్టార్‌హీరోకు భారీ హిట్..

మలయాళ సినిమా 'ప్రేమమ్' ఫేమ్ నివిన్ పౌలీ నటించిన తాజా చిత్రం 'సర్వం మాయ'.. క్రిస్మస్ స్పెషల్‌గా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. మలయాళం భారీ కలెక్షన్స్ వైపు దూసుకుపోతుంది. ఏకంగా పదేళ్ల తర్వాత నటుడు నివిన్ పౌలీకి భారీ హిట్ దక్కింది. దర్శకుడు అఖిల్ సత్యన్ తెరకెక్కించిన ఈ మూవీలో నివిన్ పౌలీ, రియా శిబు, ప్రీతి ముకుందన్, అజు వర్గీస్, జనార్ధనన్, అల్తాఫ్ సలీం నటించారు. ఓటీటీ సమయంలో తెలుగులో కూడా ఈ చిత్రం విడుదలయ్యే ఛాన్స్ ఉంది. ఈ ఏడాదిలో కొత్త లోక చిత్రం మలయాళం ఇండస్ట్రీలో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 300 కోట్ల గ్రాస్ దాటింది. 2025 సినిమా కలెక్షన్స్ లిస్ట్‌లో టాప్‌లో ఈ చిత్రం ఉంది. అయితే, ఏడాది ముగింపులో విడుదలైన సర్వం మాయ సినిమా కూడా ఇప్పుడు జోరు చూపుతుంది. ప్రస్తుతం ఈ మూవీ రూ. 76 కోట్ల గ్రాస్ రాబట్టింది. అయితే, సులువుగా రూ. 150 కోట్ల వరకు రాబట్టవచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి. 'సర్వం మాయ' కథ రొమాంటిక్ కామెడీడ్రామాకు కాస్త హారర్ జోడించడం ఆపై ఫాంటసీని కూడా కలపడంతో ప్రేక్షకులను మెప్పించింది. ఈ మూవీ విజయంలో నివిన్ పౌలీ నటన కీలకమైతే.. ఈ సినిమాలో కీలక పాత్ర పోషించిన రియా శిబూ తన అద్భుతమైన పర్ఫార్మెన్స్‌తో ఆకర్షించింది. ఇందులో ఆమె నటనపై రివ్యూవర్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. రియా శిబూకి సినీ రంగంతో బలమైన అనుబంధం ఉంది. ఆమె నిర్మాతగా కూడా రాణిస్తుంది. గతంలో హీరోయిన్‌గా మెప్పించిన రియా ఇప్పుడు నిర్మాత, డిస్ట్రిబ్యూటర్‌గా రాణిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. వీర ధీర శూరన్ చిత్రాన్ని నిర్మించిన రియా కోలీవుడ్‌లో ఆర్‌ఆర్‌ఆర్ చిత్రాన్ని పంపిణీ చేసింది.



# మూడో భార్యగా వస్తావా?

సెలబ్రిటీలను ప్రేమించమని, పెళ్లి చేసుకోమని కొందరు వెంటపడుతుంటారు. చాలామటుకు తారలు ఈ ప్రపోజల్స్ చూసి ఓ నవ్వు నవ్వి వదిలేస్తారు. కొందరు మాత్రం అందులోని తీవ్రతను, పిచ్చిని సోషల్ మీడియా వేదికగా ఎండగడతారు. తాజాగా మలేషియాకు చెందిన ఓ నటి, మోడల్‌కు కూడా వింత ప్రపోజల్ వచ్చిందట!

**వింత ప్రపోజల్**

29 ఏళ్ల మోడల్ అమీ నుర్ టినీ ఓ పాడ్‌కాస్ట్‌కు హాజరైంది. ఈ సందర్భంగా తనకు వీవీఐపీ (అత్యంత ఉన్నత స్థాయికి చెందిన వ్యక్తి/ప్రముఖుడు) నుంచి ఓ ప్రపోజల్ వచ్చిందని తెలిపింది. ఆమె మాట్లాడుతూ.. 'అతడికి మూడో భార్యగా ఉంటే నాకు ఓ బంగ్లా, లగ్జరీ కారు, పది ఎకరాల స్థలం రాసిస్తానన్నాడు. అంతేకాకుండా నా ఖర్చుల కోసం నెలకు రూ.11 లక్షలు ఇస్తానన్నాడు.

**మూడో భార్యగా ఉండమని..**

అతడి మాటలు విని షాకయ్యా.. ఈ ఆఫర్ తిరస్కరించాను. నేను కార్పొరేట్ ఈవెంట్స్‌కు యాంకరింగ్ కూడా చేస్తుంటాను. ఆ సమయంలో కొందరు ప్రముఖులు నా ఫోన్ నెంబర్ అడుగుతారు, ఇంటికి రమ్మని పిలుస్తారు. ఈ క్రమంలోనే ఓ వ్యక్తి తన మూడో భార్యగా ఉండమని కోరాడు. అతడికి దాదాపు నా తండ్రి వయసు ఉంటుంది. అతడి పిచ్చి ప్రపోజల్‌కు నేను వెంటనే నో చెప్పేశా' అని చెప్పుకొచ్చింది.

**అమ్మ కౌంటర్**

గతంలోనూ ఓ ఇంటర్వ్యూలో ఈ సంఘటన గురించి అమీ ప్రస్తావించింది. అందాల పోటీల్లో పాల్గొనేందుకు అతడు సాయం చేస్తానని ముందుకు వచ్చాడు. కాకపోతే పెళ్లి చేసుకోమని షరతు పెట్టాడు. అప్పుడు మా అమ్మ ఒక్కటే సమాధానమిచ్చింది.. నేను నా కూతుర్ని అమ్మదల్చుకోలేదని గట్టిగా బదులిచ్చింది అని పేర్కొంది.



# పొలిటికల్ ఎంటర్ టైనర్‌గా ధర్మస్థల నియోజకవర్గం

వరుణ్ సందేశ్ ,వితికా షేరు, సుమన్ ,సాయికుమార్ , నటరాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన పొలిటికల్ ఎంటర్ టైనర్ ధర్మస్థల నియోజకవర్గం. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్నిమూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మేరుం భాస్కర్ నిర్మిస్తున్నారు. ఇటీవల షూటింగ్ పూర్తి చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రం నుంచి నూతన సంవత్సర కానుకగా ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూ "మా చిత్రం ఒక డిఫరెంట్ పొలిటికల్ ఎమోషనల్ ఎంటర్టైనర్. ఈ చిత్రంలో సీనియర్ నటులైన సాయికుమార్ సుమన్ లతోపాటు యంగ్ హీరోస్ కూడా నటించారు. మంచి ఉత్కంఠ భరితమైన సన్నివేశాలతో ఈ చిత్రం తెరకెక్కించడం జరిగింది. చంద్ర బోస్ గారు అందించిన లిరిక్స్ ఈ చిత్రానికి స్పెషల్ అట్రాక్షన్. చంద్రబోస్ గారు అందించిన లిరిక్స్ కు సునీత గారు వినసొంపైన వాయిస్ ఇచ్చారు. అన్ని హంగుల్తో ఈ చిత్రాన్ని ఫిబ్రవరి లో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం . తెలుగు ప్రేక్షకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మా చిత్ర ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది" అని అన్నారు .

# యూట్యూబర్ అన్వేష్ కేసులో కీలక పరిణామం



యూట్యూబర్ అన్వేష్‌పై నమోదు అయిన కేసుల్లో కీలక పరిణామం చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసు దర్యాప్తును పంజాగుట్ట పోలీసులు వేగవంతం చేశారు. అతగాడు చేసిన అభ్యంతకర.. అనుచిత వ్యాఖ్యల తాలుకా వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అన్వేష్‌కు సంబంధించిన సోషల్ మీడియా అకౌంట్లపై ఆరాలు తీస్తున్నారు. నా అన్వేషణ చానెల్స్‌తో ప్రపంచ యాత్రికుడు, ఆటగాడిగా పాపులారిటీ సంపాదించుకున్న అన్వేష్.. సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ సినీనటి, బీజేపీ నేత అయిన కరాటే కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అభ్యంతర కంటెంట్ ప్రచారం చేశారని పేర్కొనడంతో అన్వేష్‌పై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే.. ఈ కేసులో నోటీసులు ఇవ్వడానికి ముందు అతని అకౌంట్లకు వెరిఫై చేసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు అన్వేష్ యూజర్ ఐడీ వివరాలు కావాలంటూ ఇన్‌స్టాగ్రామ్‌కు ఓ లేఖ రాసినట్లు తెలుస్తోంది. తద్వారా వారిచ్చే వివరాలతో అతని అకౌంట్లను పరిశీలించనున్నారు. ఇప్పటికే అన్వేష్‌పై ఖమ్మంలోని ఖానాపురంహవేలి పీఎస్‌లో ఓ కేసు నమోదయ్యింది. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా హిందువులు పూజించే సీతాదేవి, ద్రౌపదీదేవిలపట్ల అసభ్యంగా వీడియో రిలీజ్ చేశాడని ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. హీరోయిన్ల వస్త్రధారణపై సినీ నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలను ఖండించే క్రమంలో అన్వేష్ తన నోటికి పని చెప్పాడు. హిందూ దేవతల ప్రస్తావనతో వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను హిందూ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అన్వేష్‌ను దేశద్రోహిగా ప్రకటించాలని.. వెంటనే భారత్‌కు రప్పించి.. శిక్షించాలని కోరుతున్నాయి. అదే సమయంలో అతన్ని అన్‌ఫాలో కొడుతూ నెట్టింట మినీ ఉద్యమమే నడిపిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com